


PRGI NO: APTEL/26/A7657

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ ‖ సంపుటి:1 ‖ సంచిక: 10 ‖ శుక్రవారం ‖ 25-9-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-

25 సెప్టెంబర్ 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:09 సూర్యాస్తమయం - సా. 6:06 తిథి చతుర్దశి రా. 11:02 వరకు తరువాత పౌర్ణమి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం శతభిష ఉ. 11:10 వరకు తరువాత పూర్వాభాద్ర యోగం శూల మ. 2:43 వరకు కరణం గరజి ఉ. 11:14 వరకు వనిజ రా. 11:02 వరకు వర్జ్యం సా. 5:48 నుండి రా. 7:25 వరకు దుర్ముహూర్తం ఉ. 8:32 నుండి ఉ. 9:20 వరకు మ. 12:31 నుండి మ. 1:19 వరకు రాహుకాలం ఉ. 10:38 నుండి మ. 12:07 వరకు యమగండం మ. 3:07 నుండి సా. 4:36 వరకు గుళికాకాలం ఉ. 7:38 నుండి ఉ. 9:08 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:33 నుండి తె. 5:21 వరకు అమృత ఘడియలు తె. 3:23 నుండి తె. 5:00 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:43 నుండి మ. 12:31 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

# వర్షాలపై సమీక్ష

## వర్షాలు, వరద పరిస్థితులపై ఉన్నతస్థాయి సమావేశం



### నీటి వనరులన్నీ నింపేలా చర్యలకు చంద్రబాబు ఆదేశం

### అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచన

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురు గాలులు, నదులు, వాగుల్లో పెరుగుతున్న వరద ప్రవాహాలు, రిజర్వాయర్లలోకి చేరుతున్న నీటి పరిస్థితులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రియల్‌టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశమైన ముఖ్యమంత్రి, ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో పాటు రాబోయే రోజుల పరిస్థితులపై సమగ్ర వివరాలు తెలుసుకున్నారు.

అమరావతి, సెప్టెంబర్ 24: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా గత మూడు రోజులుగా విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ వర్షాల కారణంగా భూగర్భ జలాలు కొంత మేర పెరిగాయని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొన్న అనేక ప్రాంతాల్లో ఈ వర్షాలు ఉపశమనం కలిగించాయని పేర్కొన్నారు. అయితే కొన్ని తరువాయి 2 వ పేజీలో..

## బెజవాడ మేయర్ పీఠంపై జనసేన గురి



# విజయవాడ మేయర్ సీటు కోసం పవన్‌పై ఒత్తిడి?

## మేయర్ సీటు జనసేనకు వస్తే.. పెనుగొండకే ఛాన్స్?

### కూటమిలో మేయర్ పదవి ఎవరికి? కొనసాగుతున్న చర్చ

బెజవాడ నగర రాజకీయాల్లో మేయర్ పీఠం చుట్టూ కొత్త చర్చ మొదలైంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయవాడ మేయర్ పదవిని జనసేన కోరుకునే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్న వేళ.. మేయర్ అభ్యర్థిగా పెనుగొండ సుబ్బారాయుడు పేరు తెరపైకి రావడం ఆసక్తికరంగా మారింది. కూటమిలో మేయర్ పదవి ఏ పార్టీకి దక్కుతుందన్న అంశం ఇంకా స్పష్టతకు రాకపోయినా.. జనసేనకు అవకాశం వస్తే సుబ్బారాయుడు పేరును పరిశీలించే చాన్స్ ఉందన్న చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. అయితే, తుది నిర్ణయం పార్టీ అధిష్ఠానం, కూటమి సమన్వయంపై ఆధారపడి ఉంటుంది.

విజయవాడ: పెనుగొండ సుబ్బారాయుడికి రాజకీయాల కంటే ముందే సుదీర్ఘమైన వృత్తి, సామాజిక సేవా నేపథ్యం ఉంది. ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్‌గా నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగిన ఆయన.. ఆర్థిక, పన్నులు, కార్పొరేట్ పాలన, ఆర్థిక మార్కెట్లకు సంబంధించిన వ్యవహారాల్లో పనిచేశారు. దక్షిణ భారత ప్రాంతీయ మండలి కమిటీల్లోనూ బాధ్యతలు నిర్వర్తించారు. ప్రాంతీయ ప్రత్యక్ష పన్నుల సలహా కమిటీలో సభ్యుడిగా కూడా తరువాయి 2 వ పేజీలో..

## అమెరికా వాయేజర్ స్కాలర్‌షిప్‌కు రిత్విక్ కొర్రపాటి ఎంపిక

### రిత్విక్ కేఆర్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ డా. కొర్రపాటి సుధాకర్ వారసుడే

### అమెరికా వ్యాప్తంగా 100 మందికే అవకాశం

### మండలంలో పలువురు హర్షం



కామవరపుకోట: అమెరికాలోని ప్రతిష్టాత్మక ది ఒబామా చెస్కీ వాయేజర్ స్కాలర్‌షిప్ ఫర్ పబ్లిక్ సర్వీస్‌కు మండలంలోని తడికలపూడిలోని కే ఆర్ ఆర్ బ్రైట్‌మైండ్ స్కూల్ చైర్మన్ డాక్టర్ కొర్రపాటి సుధాకర్, డాక్టర్ గీత దంపతుల రెండో కుమారుడు కొర్రపాటి రిత్విక్ ఎంపికయ్యారు. అమెరికా మాజీ అధ్యక్షుడు, నోబెల్ బహుమతి విజేత బరాక్ ఒబామా, తరువాయి 2 వ పేజీలో..



## భారీ వర్షాలతో విమానం దారి మళ్లింపు

### భోగాపురంలో దిగలేకపోయిన ఎయిర్ ఇండియా విమానం

### నాగపూర్‌కు మళ్లించిన అధికారులు

### విమానంలో మంత్రులు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్

### 70 మంది ప్రయాణికులు సురక్షితం

భోగాపురం, సెప్టెంబర్ 24 : భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా భోగాపురం విమానాశ్రయంలో దిగాల్సిన ఎయిర్ ఇండియా ఐఎక్స్-1373 విమానం చివరి క్షణంలో నాగపూర్‌కు దారి మళ్లించబడింది. విజయవాడ నుంచి భోగాపురానికి బయలుదేరిన ఈ విమానం సురక్షితంగా నాగపూర్‌లో ల్యాండ్ కావడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అధికారుల సమాచారం ప్రకారం, భోగాపురం తరువాయి 2 వ పేజీలో..

## మహాదేవ్ యాప్‌పై ఈడీ కీలక వివరాలు

### రూ.94,400 కోట్ల అక్రమ ఆదాయం ఆరోపణ

### 42 మంది, సంస్థలతో సంబంధాలున్నట్లు వెల్లడి

### బెట్టింగ్ యాప్ ఇంకా కొనసాగుతోందన్న ఈడీ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24: మహాదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక వివరాలను కోర్టుకు సమర్పించింది. గత పదేళ్లలో ఈ యాప్ ద్వారా సుమారు రూ.94,400 కోట్ల అక్రమ ఆదాయం ఆర్జించినట్లు తాజా ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నట్లు వెల్లడించింది. రాయ్‌పూర్‌లోని మనీలాండరింగ్ కోర్టులో ఈడీ ఆరోసారి ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. మహాదేవ్ బెట్టింగ్ యాప్‌తో సుమారు 42 మంది వ్యక్తులు, సంస్థలకు సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించామని ఈడీ కోర్టుకు తెలిపింది. యాప్ ప్రమోటర్లు, ప్యానల్ సభ్యులు మధ్య భారతదేశానికి చెందినవారని, అక్రమ బెట్టింగ్ తరువాయి 2 వ పేజీలో..



## అబాట్ సంస్థకు ఏపీ పెట్టుబడుల ఆహ్వానం

### వైద్య పరికరాలు, నిర్ధారణ పరికరాల తయారీపై చర్చలు

### నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్‌లో పెట్టుబడులకు ఆహ్వానం

### విశాఖలో గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ ఏర్పాటుకు సూచన

ఆంధ్రప్రదేశ్‌లో వైద్య, ఔషధ రంగ పెట్టుబడుల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి నారా లోకేష్ తెలిపారు. అబాట్ సంస్థ ప్రతినిధి ఇష్టియాక్ అంజాద్‌తో జరిగిన సమావేశంలో రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై విస్తృతంగా చర్చించారు.

అమరావతి, సెప్టెంబర్ 24: భారతదేశంలో అబాట్ సంస్థ అందిస్తున్న విభిన్న ఉత్పత్తులు, సేవల గురించి తెలుసుకోవడం ఆసక్తికరంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో వైద్య పరికరాలు, నిర్ధారణ పరికరాల తయారీ రంగంలో పెట్టుబడులు పెట్టాలని సంస్థ ప్రతినిధులను ఆహ్వానించారు. విశాఖపట్నంలోని ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్, ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్లలో వైద్య తరువాయి 2 వ పేజీలో..

## దాడులు సహించేది లేదు

### డీఎస్సీ అంశంపై రాజకీయ రగడ వద్దు

### చట్టబద్ధ మార్గాల్లోనే సమస్యల పరిష్కారం

### శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

### ఎవరూ అతీతులు కారు: హోంమంత్రి




డీఎస్సీ అంశాన్ని రాజకీయ వివాదంగా మార్చే ప్రయత్నాల పేరుతో ఉపాధ్యాయులపై దాడులు, బెదిరింపులు చేయడాన్ని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉన్నప్పటికీ, ఆ హక్కు పేరుతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం అనుమతించబోమన్నారు.

అమరావతి, సెప్టెంబర్ 24: ఇటీవల డీఎస్సీ అంశంపై చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో స్పందించిన ఆమె, ఉపాధ్యాయులపై దాడులు లేదా భయాందోళనలు సృష్టించే చర్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో తీవ్రమైన నేరాలుగా పరిగణించబడతాయని -2 వ పేజీలో..

# నేటి రాశి ఫలాలు

మేషం: ఉద్యోగంలో అనుకూలమైన మార్పులు చోటుచేసుకుంటాయి, పై అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతారు. చేపట్టిన ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి, నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు.

వృషభం: ఆర్థిక పరిస్థితి చాలా మెరుగ్గా ఉంటుంది, నూతన వస్తువులు లేదా గృహోపకరణాలు కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఆరోగ్యం పట్ల కొద్దిగా శ్రద్ధ వహించడం మంచిది. తోబుట్టువుల నుండి ఆశించిన మద్దతు లభిస్తుంది.

మిధునం: పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పటికీ పట్టుదలతో పనులను సకాలంలో పూర్తి చేస్తారు. వ్యాపారంలో భాగస్వాములతో మాట్లాడేటప్పుడు తొందరపాటు పనికిరాదు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది, దైవదర్శనాలు చేసుకుంటారు.

కర్కాటకం: సమాజంలో మీ గౌరవ మర్యాదలు పెరుగుతాయి, అనుకోని విధంగా ఆకస్మిక ధనలాభం కలుగుతుంది. మిత్రులతో కలిసి విందు వినోదాలలో పాల్గొంటారు. దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న పనులు సజావుగా సాగుతాయి.

సింహం: సమాజంలో నూతన పరిచయాలు ఏర్పడతాయి, ఇవి భవిష్యత్తులో మీ వ్యాపార అభివృద్ధికి ఎంతగానో తోడ్పడతాయి. ముఖ్యమైన పనులలో విజయం సాధిస్తారు. కోపాన్ని నియంత్రించుకోవడం వల్ల బంధాలు దెబ్బతినకుండా ఉంటాయి.

కన్య: వృత్తి ఉద్యోగాల్లో బదిలీలు లేదా పదోన్నతల సూచనలు కనిపిస్తున్నాయి. ఆర్థిక ఇబ్బందులు చాలా వరకు తొలగిపోయి ఆదాయం నిలకడగా ఉంటుంది. కుటుంబంలో ప్రశాంత వాతావరణం ఉంటుంది, ఆరోగ్యం సహకరిస్తుంది.

తుల: చేపట్టిన పనులు కొంత నెమ్మదిగా సాగుతాయి, కాబట్టి ఓర్పుతో వ్యవహరించడం అవసరం. అనవసర ఖర్చులు పెరగకుండా చూసుకోవాలి. ముఖ్యమైన విషయాల్లో కుటుంబ పెద్దల సలహాలు తీసుకోవడం వల్ల మేలు జరుగుతుంది.

వృశ్చికం: మీరు పడిన శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. పాత మిత్రులను అనుకోకుండా కలుసుకోవడం వల్ల మనస్సుకు ఎంతో ఆనందం కలుగుతుంది. ఆరోగ్యం స్థిరంగా ఉంటుంది, నూతన పెట్టుబడులు పెట్టడానికి అనుకూలమైన రోజు.

ధనస్సు: వృత్తి, వ్యాపారాలలో ఆశించిన అభివృద్ధి, ఆకస్మిక లాభాలు ఉంటాయి. బంధువుల నుండి ఒక శుభవార్త వింటారు. ఇంట్లో సంతోషకరమైన, ఉత్సాహభరితమైన వాతావరణం నెలకొంటుంది, ప్రయాణాలు కలసివస్తాయి.

మకరం: అనవసర వివాదాలకు, ఇతరుల విషయాలకు దూరంగా ఉండటం మంచిది. కార్యాలయంలో సహోద్యోగులతో చిన్నపాటి విభేదాలు వచ్చే సూచనలున్నాయి. ఖర్చుల విషయంలో బడ్జెట్ ప్రకారం నడుచుకోవడం ఎంతైనా అవసరం.

కుంభం: వృధా ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. దీర్ఘకాలిక ఋణ భారం పెరుగుతుంది. ఇంటా బయటా ఊహించని సమస్యలు కలుగుతాయి. దైవదర్శనాలు చేసుకుంటారు. వృత్తి, వ్యాపారాలు అంతగా అనుకూలించవు. సంతాన అనారోగ్యం విషయంలో జాగ్రత్త వ్యవహరించాలి. సోదరులతో స్వల్ప వివాదాలు ఉంటాయి.

మీనం: ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు కలుగుతాయి. ఆప్తులతో శుభాకార్యాలలో పాల్గొంటారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. విద్యార్థులు పోటీ పరీక్షలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభలు అందుకుంటారు. దైవ చింతన పెరుగుతుంది.



# గురువులపై దాడులు సహించేది లేదు

మొదటి పేజీ తరువాయి

హెచ్చరించారు. ప్రజలకు సంబంధించిన అంశాలపై ప్రశ్నలు అడగడానికి, ప్రభుత్వ నిర్ణయాలను నిలదీయడానికి ప్రజాస్వామ్యంలో అసెంబ్లీ వంటి వేదికలు ఉన్నాయని అనిత పేర్కొన్నారు. అలాగే న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించే అవకాశాలు కూడా అందరికీ అందుబాటులో ఉన్నాయని గుర్తు చేశారు. అలాంటి చట్టబద్ధ మార్గాలను పక్కనబెట్టి దాడులు, బెదిరింపులు, హింసాత్మక చర్యలకు దిగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో విభేదాలు సహజమే అయినప్పటికీ వాటి పరిష్కారం కూడా ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే జరగాలని ఆమె అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను దెబ్బతీయడానికి కొందరు ఉద్దేశపూర్వకంగా ఉద్రిక్త పరిస్థితులను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని అనిత ఆరోపించారు. భయానక వాతావరణాన్ని సృష్టించి ప్రజల్లో ఆందోళన పెంచడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అలాంటి చర్యలను ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని, ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోదని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని, భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే బాధ్యత వారి భుజాలపై ఉంటుందని అనిత అన్నారు. అలాంటి గురువుల గౌరవానికి భంగం కలిగించే చర్యలు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కావని తెలిపారు. ఉపాధ్యాయులపై దాడులు చేయడం అంటే విద్యా వ్యవస్థపైనే దాడి చేసినట్టేనని పేర్కొన్నారు. వారి భద్రతను కాపాడటం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని, అవసరమైన అన్ని రక్షణ చర్యలు చేపడతామని వెల్లడించారు. రాష్ట్ర ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం రాజీపడే ప్రసక్తే లేదని హోంమంత్రి స్పష్టం చేశారు. చట్టాన్ని అతిక్రమించి అల్లర్లు, దాడులు లేదా బెదిరింపులకు పాల్పడే వారిపై కఠిన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. వ్యక్తులు ఎంత ప్రభావశీలులైనా, ఏ రాజకీయ నేపథ్యం కలిగి ఉన్నా చట్టం తన పని తాను చేస్తుందని పేర్కొన్నారు. చట్టపరమైన వ్యవస్థపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉండాలని ఆమె సూచించారు. ప్రశాంతమైన ఆంధ్రప్రదేశ్‌ను అస్థిరత, విధ్వంసం వైపు నడిపించాలనే ప్రయత్నాలు ఎవరైనా చేసినా ప్రభుత్వం ఉపేక్షించబోదని అనిత హెచ్చరించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, సామాజిక సామరస్యం కోసం శాంతియుత వాతావరణం అత్యంత అవసరమని పేర్కొన్నారు. అందుకే శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రతి చర్యను కఠినంగా అడ్డుకుంటామని తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమేనని, ఎవరూ చట్టానికి అతీతులు కారనే స్పష్టమైన సందేశాన్ని ప్రభుత్వం మరోసారి ఇస్తోందని ఆమె అన్నారు.

# అబాట్ సంస్థకు ఏపీ పెట్టుబడుల ఆహ్వానం

మొదటి పేజీ తరువాయి

పరికరాల తయారీ యూనిట్లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అలాగే నక్కపల్లిలో ఏర్పాటు కానున్న బల్క్ డ్రగ్ పార్క్‌లో ఔషధ తయారీ పరిశ్రమలు స్థాపించాలని కోరారు. విశాఖపట్నంలో గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని కూడా అబాట్ సంస్థకు ఆహ్వానం పలికారు. జీవ విజ్ఞాన శాస్త్రాలు, ఆరోగ్య సంరక్షణ, ఔషధ తయారీ రంగాల్లో సమగ్ర పారిశ్రామిక వాతావరణాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని మంత్రి వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల విధానాలు, ఆధునిక మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అబాట్ సంస్థతో భవిష్యత్తులో మరింత విస్తృత భాగస్వామ్యానికి రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తిగా ఎదురుచూస్తోందని మంత్రి నారా లోకేష్ తెలిపారు.




# వర్షాలపై సమీక్ష

తరువాయి 2 వ పేజీలో...

ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా వరద పరిస్థితులు కూడా ఏర్పడుతున్నందున అప్రమత్తంగా వ్యవహరించాలని సీఎం సూచించారు.

రాష్ట్రంలోని 16 జిల్లాల్లో గణనీయమైన వర్షపాతం నమోదైనట్లు సమీక్షలో వెల్లడైంది. విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు జిల్లా, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో వర్షాల ప్రభావం అధికంగా కనిపిస్తున్నట్లు అధికారులు వివరించారు. పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని, నదుల్లో నీటి ప్రవాహం పెరిగిందని తెలిపారు. భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని జలాశయాలు, చెరువులు, ఆనకట్టల్లోకి గణనీయంగా నీరు చేరుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్రంలోని అన్ని నీటి వనరులను పూర్తిస్థాయిలో నింపేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వర్షపు నీరు వృథా కాకుండా నిల్వ చేసే దిశగా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అవసరమైన చోట ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు సహాయక చర్యలు సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యుత్, రవాణా, తాగునీటి సరఫరా వంటి అత్యవసర సేవల్లో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. విపత్తు నిర్వహణ, రెవెన్యూ, జలవనరులు, విద్యుత్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి అధికారుల సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించడంతో పాటు అందుబాటులో ఉన్న నీటి వనరులను గరిష్ఠంగా వినియోగించుకునేలా కార్యాచరణ కొనసాగించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# విజయవాడ మేయర్ సీటు కోసం పవన్‌పై ఒత్తిడి?

మొదటి పేజీ తరువాయి

పనిచేశారు. ఈ నేపథ్యంలో ఆర్థిక, పరిపాలనా అంశాలపై ఆయనకు ఉన్న అనుభవాన్ని మేయర్ పదవికి అనుకూల అంశంగా ఆయన వర్గం ప్రస్తావిస్తోంది. సుబ్బారాయుడి సామాజిక ప్రస్థానం కూడా ఆయనకు మరో బలంగా కనిపిస్తోంది. ఆర్యవైశ్య మహాసభలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఆయన.. 2018 నుంచి 2020 వరకు రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం గౌరవ అధ్యక్షుడిగా కొనసాగారు. భవన నిర్మాణ కమిటీ చైర్మన్‌గా, వాసవి సత్ర సముదాయాలకు ఆర్బిట్రేటర్‌గా, చైతన్య తపోవనం గౌరవ అధ్యక్షుడిగా, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ గౌరవ అధ్యక్షుడిగా వివిధ బాధ్యతలు చేపట్టారు. విజయవాడ క్లబ్ మాజీ కోశాధికారిగా కూడా సేవలందించారు. దీంతో సంస్థాగత నిర్వహణతో పాటు సామాజిక వర్గాల్లో ఆయనకు ఉన్న పరిచయాలు రాజకీయంగా ఉపయోగపడతాయన్న చర్చ జరుగుతోంది. లయన్స్ క్లబ్‌తోనూ పెనుగొండ సుబ్బారాయుడికి సుదీర్ఘ అనుబంధం ఉంది. దాదాపు 38 ఏళ్లకు పైగా లయన్స్ సంస్థతో కలిసి పనిచేస్తున్న ఆయన.. జిల్లా స్థాయిలో వివిధ బాధ్యతలు నిర్వర్తించారు. విజయవాడ ఈస్ట్ లయన్స్ కంటి ఆసుపత్రి గౌరవ చైర్మన్‌గా వ్యవహరించారు. పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం, చార్టెడ్ అకౌంటెన్సీ విద్యార్థులకు విద్యా సహాయం చేస్తున్నారు. ముషీరాబాద్ ఆర్యవైశ్య హాస్టల్‌కు దాత-చైర్మన్‌గా, విజయవాడ ఆర్యవైశ్య హాస్టల్‌కు దాత-కన్వీనర్‌గా సేవలు అందిస్తున్నారు. ఈ సేవా నేపథ్యం మేయర్ అభ్యర్థిత్వానికి అదనపు బలంగా మారుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయంగా చూస్తే.. పెనుగొండ సుబ్బారాయుడి ప్రయాణం జనసేనతోనే ప్రారంభమైంది. పవన్ కల్యాణ్ సేవా దృక్పథం తనను ప్రభావితం చేసిందని చెబుతూ.. 2025 జూలై 10న జనసేనలో చేరారు. ఆ తర్వాత పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ.. పార్టీ నిర్మాణ సారథుల సమాచార సెంట్రల్ కమిటీలో సభ్యుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఐదుగురు సభ్యులతో కూడిన ఈ కమిటీలో ఆయన కూడా ఒకరుగా పార్టీకి సంబంధించిన సమాచార సేకరణ, క్రోడీకరణలో భాగస్వామిగా ఉన్నట్లు తెలుస్తోంది. రాజకీయంగా కొత్తగా కనిపించినప్పటికీ.. సంస్థాగత నిర్వహణలో ఉన్న సుదీర్ఘ అనుభవాన్ని పార్టీ కార్యక్రమాల్లో వినియోగించుకునే అవకాశం ఆయనకు కలిసొచ్చే అంశంగా మారవచ్చు. అయితే అసలు ప్రశ్న విజయవాడ మేయర్ పీఠం జనసేనకు దక్కుతుందా? అన్నదే. కూటమి పార్టీల మధ్య స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాతినిధ్యం, సీట్ల పంపకం ఎలా ఉండబోతుందన్న దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ మేయర్ పదవి జనసేనకు కేటాయించే పరిస్థితి వస్తే.. పార్టీకి సామాజిక పరిచయాలు, సంస్థాగత అనుభవం, ఆర్థిక-పరిపాలనా అవగాహన కలిగిన అభ్యర్థి అవసరం ఉండొచ్చన్న చర్చ నేపథ్యంలో పెనుగొండ సుబ్బారాయుడు పేరు పరిశీలనలోకి వచ్చే అవకాశముంది. అయితే మేయర్ అభ్యర్థిగా ఆయన పేరుపై అధికారిక నిర్ణయం వెలువడాల్సి ఉంది. దీంతో బెజవాడ మేయర్ పీఠంపై జనసేన కర్చీఫ్ వేసింది. పెనుగొండ సుబ్బారాయుడికి గ్రీన్ సిగ్నల్ వస్తుందా? అన్నది ఇప్పుడు విజయవాడ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది.

# మహాదేవ్ యాప్‌పై ఈడీ కీలక వివరాలు

మొదటి పేజీ తరువాయి

వెబ్‌సైట్ల ద్వారా కార్యకలాపాలు నిర్వహించినట్లు గుర్తించినట్లు పేర్కొంది. యాప్ కార్యకలాపాలు ఇంకా కొనసాగుతున్నాయని తెలిపింది. వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా మహాదేవ్ యాప్‌ను ప్రచారం చేసినట్లు ఈడీ పేర్కొంది. వివిధ లింకుల ద్వారా వేలాది మంది యువతను బెట్టింగ్ వైపు ఆకర్షించినట్లు తెలిపింది. ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో నమోదైన కేసుల ఆధారంగా 2022 అక్టోబర్‌లో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించింది.

## పలు ఆటలపై బెట్టింగ్

2019 నుంచి మహాదేవ్ యాప్ ద్వారా సుమారు రూ.80 వేల కోట్ల ఆదాయం వచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైందని ఈడీ పేర్కొంది. యాప్‌కు అనుబంధంగా ఉన్న ఇతర వెబ్‌సైట్ల ద్వారా కూడా భారీగా ఆదాయం ఆర్జించినట్లు తెలిపింది. క్రికెట్, బ్యాడ్మింటన్, టెన్నిస్, ఫుట్‌బాల్ వంటి క్రీడలతో పాటు పోకర్, కార్డు గేమ్స్, ఛాన్స్ గేమ్స్, తీన్ పత్తి, డ్రాగన్ టైగర్, వర్చువల్ క్రికెట్ వంటి ఆన్‌లైన్ ఆటలపై బెట్టింగ్ నిర్వహించినట్లు ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నట్లు వెల్లడించింది.

# వాయేజర్ స్కాలర్‌షిప్‌కు రిత్విక్ కొర్రపాటి ఎంపిక

మొదటి పేజీ తరువాయి

మిషెల్ ఒబామా, ఎయిర్‌బీఎన్‌బీ వ్యవస్థాపకులు బ్రయాన్ చెస్కీ కలిసి ప్రారంభించిన ఈ స్కాలర్‌షిప్‌లో అమెరికా దేశ వ్యాప్తంగా 100 మందికే అవకాశం దక్కుతుంది. రెండేళ్ల నాయకత్వ స్కాలర్‌షిప్ కార్యక్రమంలో ప్రజాసేవ పట్ల ఆసక్తిఉన్న యువతను భావి నాయకులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా కళాశాలల్లో రెండో సంవత్సరం పూర్తి చేసి మూడో సంవత్సరంలోకి అడుగు పెడుతున్న లక్షలాది మంది విద్యార్థుల నుంచి కేవలం 100 మందిని మాత్రమే ఎంపిక చేస్తే.. అందులో కొర్రపాటి సుధాకర్ తనయుడు రిత్విక్ ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ఎంపిక కావడం విశేషం. సమాజ సేవ, ప్రజాహితం, నాయకత్వ లక్షణాలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఈ కార్యక్రమం ప్రత్యేక అవకాశాలను అందిస్తుందని డాక్టర్. సుధాకర్ తెలిపారు. సమాజానికి మేలు చేయాలనే దృక్పథంతో పాటు నాయకత్వ లక్షణాలను ప్రదర్శించిన కొర్రపాటి రిత్విక్ ఈ అరుదైన అవకాశం దక్కించుకున్నారు. వాయేజర్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన చిరంజీవి రిత్విక్‌కు కేఆర్ఆర్ విద్యాసంస్థల సిబ్బంది, మండలంలోని పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

# భారీ వర్షాలతో విమానం దారి మళ్లింపు

మొదటి పేజీ తరువాయి

ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దృశ్యమానత తగ్గిపోవడంతో పాటు విమాన ల్యాండింగ్‌కు అవసరమైన సిగ్నల్ వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోవడం వల్ల పైలట్లు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను అనుసరించారు. భద్రతా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని విమానాన్ని నాగపూర్ విమానాశ్రయానికి మళ్లించినట్లు తెలిసింది. విమానంలో రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు సుమారు 70 మంది ప్రయాణికులు ఉన్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా విమానం గమ్యస్థానానికి చేరకపోవడంతో కొంతసేపు ఆందోళన నెలకొన్నప్పటికీ, పైలట్లు పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొని విమానాన్ని సురక్షితంగా నడిపించారు. సుమారు రెండు గంటల పాటు ఉత్కంఠభరిత పరిస్థితులు కొనసాగిన తర్వాత నాగపూర్ విమానాశ్రయంలో విమానం సురక్షితంగా దిగింది. దీంతో ప్రయాణికులు, వారి కుటుంబ సభ్యులు ఊరట చెందారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడం సిబ్బంది అప్రమత్తతకు నిదర్శనంగా నిలిచింది.

# శ్వేత

## సంపాదకీయం

**శుక్రవారం 25-9-2026**

# సాంకేతిక విప్లవంతో మారిన జీవనశైలి

ఇరవై ఒకటవ శతాబ్దంలో మానవ జీవితాన్ని అత్యంత ప్రభావితం చేసిన అంశాల్లో ఆన్‌లైన్ ప్రపంచం ఒకటి. ఒకప్పుడు సమాచారాన్ని పొందడానికి రోజులు పట్టే పరిస్థితి ఉండేది. ఇప్పుడు కేవలం కొన్ని క్షణాల్లో ప్రపంచంలోని ఏ మూలో ఉన్న సమాచారాన్నైనా తెలుసుకునే అవకాశం అందుబాటులోకి వచ్చింది. విద్య, వైద్యం, వ్యాపారం, ఉద్యోగాలు, బ్యాంకింగ్, వినోదం, ప్రభుత్వ సేవలు వంటి అనేక రంగాలు డిజిటల్ వేదికలపై ఆధారపడుతున్నాయి. ఈ మార్పు మానవ జీవితాన్ని సులభతరం చేసినప్పటికీ, మరోవైపు కొత్త సమస్యలను కూడా తీసుకొచ్చింది. ముఖ్యంగా ఆన్‌లైన్ వినియోగం అవసరాన్ని దాటి వ్యసనంగా మారుతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆన్‌లైన్ ప్రపంచం అందించిన అవకాశాలు అపారమైనవి. విద్యార్థులు ప్రపంచ స్థాయి పాఠాలను ఇంటి నుంచే నేర్చుకునే అవకాశం పొందుతున్నారు. చిన్న వ్యాపారాలు కూడా డిజిటల్ వేదికల ద్వారా ప్రపంచ మార్కెట్‌ను చేరుకుంటున్నాయి. ఉద్యోగ అవకాశాల కోసం నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే పనిచేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. రైతులు పంటల ధరలు తెలుసుకోవడం నుంచి వ్యాపారవేత్తలు అంతర్జాతీయ లావాదేవీలు నిర్వహించడం వరకు ప్రతి రంగంలో ఆన్‌లైన్ సేవలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. సమాచార విప్లవం ప్రజలకు కొత్త అవకాశాల ద్వారాలను తెరిచిందనడంలో సందేహం లేదు.

అయితే ఈ అవకాశాలతో పాటు ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయి. సామాజిక మాధ్యమాలు, ఆన్‌లైన్ ఆటలు, నిరంతర వీడియో వీక్షణ, అవసరం లేని సమాచార వినియోగం వంటి కారణాలతో చాలా మంది గంటల తరబడి తెరల ముందే గడుపుతున్నారు. ముఖ్యంగా పిల్లలు, యువతలో ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. చదువు, ఉద్యోగం, కుటుంబ సంబంధాలు, ఆరోగ్యం వంటి అంశాలపై ప్రతికూల ప్రభావం పడుతున్నా చాలామంది దానిని గుర్తించలేకపోతున్నారు. క్రమంగా ఇది డిజిటల్ వ్యసనంగా మారి వ్యక్తిగత జీవితాన్ని ప్రభావితం చేసే పరిస్థితి ఏర్పడుతోంది.

పిల్లల్లో ఆన్‌లైన్ వ్యసనం మరింత తీవ్రమైన సమస్యగా మారుతోంది. మొబైల్ ఫోన్లు, టాబ్లెట్లు, ఆన్‌లైన్ ఆటలు చిన్న వయస్సులోనే పిల్లలను ఆకర్షిస్తున్నాయి. ఫలితంగా బహిరంగ ఆటలు, పుస్తక పఠనం, కుటుంబ సభ్యులతో గడిపే సమయం తగ్గిపోతోంది. కొందరిలో ఏకాగ్రత లోపం, చిరాకు, నిద్రలేమి వంటి సమస్యలు కూడా కనిపిస్తున్నాయి. తల్లిదండ్రులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిగా నిరాకరించాల్సిన అవసరం లేకపోయినా, పిల్లల వినియోగాన్ని పర్యవేక్షించడం మాత్రం తప్పనిసరి. డిజిటల్ ప్రపంచాన్ని ఉపయోగించడంలో క్రమశిక్షణ అలవాటు చేయడం అవసరం. ఆన్‌లైన్ ప్రపంచం మానసిక ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతోంది. ఇతరుల జీవితాలను చూసి తమ జీవితాలను పోల్చుకోవడం, నిరంతరం గుర్తింపు కోసం ఎదురుచూడడం, ప్రతికూల వ్యాఖ్యల ప్రభావం వంటి అంశాలు మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో ఎక్కువ సమయం గడిపే కొందరిలో ఆందోళన, ఒంటరితనం, నిరాశ వంటి సమస్యలు పెరుగుతున్నాయని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. వాస్తవ జీవిత సంబంధాల కంటే ఆన్‌లైన్ సంబంధాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం కూడా సామాజిక బంధాలను బలహీనపరుస్తోంది.

ఇంకోవైపు తప్పుడు సమాచారం వ్యాప్తి కూడా ఆన్‌లైన్ ప్రపంచంలో ఒక ప్రధాన సవాలుగా మారింది. నిర్ధారణ లేని వార్తలు, అసత్య ప్రచారాలు, మోసపూరిత ప్రకటనలు వేగంగా వ్యాపిస్తున్నాయి. చాలామంది నిజానిజాలు తెలుసుకోకుండా వాటిని పంచుకోవడం వల్ల సామాజిక సమస్యలు తలెత్తుతున్నాయి. డిజిటల్ అక్షరాస్యత పెంపొందించడం, సమాచారాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించే అలవాటు పెంచుకోవడం కాలానుగుణ అవసరంగా మారింది. బాధ్యతాయుతమైన వినియోగం ద్వారానే ఈ సమస్యలను అధిగమించవచ్చు.

ఆన్‌లైన్ ప్రపంచం పూర్తిగా మంచిదని లేదా పూర్తిగా చెడ్డదని చెప్పడం సరికాదు. అది ఒక సాధనం మాత్రమే. దానిని ఎలా ఉపయోగిస్తామన్నదే ఫలితాలను నిర్ణయిస్తుంది. విద్య కోసం, నైపుణ్యాల అభివృద్ధి కోసం, ఉపాధి అవకాశాల కోసం వినియోగిస్తే అది అభివృద్ధికి మార్గం అవుతుంది. అదే నియంత్రణ లేకుండా వినోదం, వ్యసనాలకు పరిమితమైతే సమస్యలకు కారణమవుతుంది. అందువల్ల వ్యక్తిగత స్థాయిలో సమయపాలన, వినియోగ పరిమితులు, ఆరోగ్యకరమైన అలవాట్లు అవసరం.

సాంకేతిక పరిజ్ఞానం భవిష్యత్తులో మరింత విస్తరించే అవకాశం ఉంది. కృత్రిమ మేధస్సు, వాస్తవిక ప్రపంచ అనుభూతులు, డిజిటల్ సేవల విస్తరణతో ఆన్‌లైన్ ప్రపంచం మన జీవితాల్లో మరింత భాగమవుతుంది. ఈ నేపథ్యంలో విద్యాసంస్థలు, కుటుంబాలు, ప్రభుత్వాలు, సామాజిక సంస్థలు కలిసి డిజిటల్ బాధ్యతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. సాంకేతిక పురోగతిని స్వాగతిస్తూనే దాని దుష్ప్రభావాలను తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలి. ఆన్‌లైన్ ప్రపంచం మనకు అపార అవకాశాలను అందించిన గొప్ప వేదిక. అదే సమయంలో అది నియంత్రణ లేకపోతే వ్యసనంగా మారే ప్రమాదం కూడా ఉంది. కాబట్టి అవకాశాలను అందిపుచ్చుకుంటూ, ప్రమాదాలను గుర్తిస్తూ సమతుల్య దృక్పథంతో ముందుకు సాగడం అవసరం. సాంకేతికత మన జీవితాన్ని నియంత్రించే స్థితి కాకుండా, మన అభివృద్ధికి ఉపయోగపడే సాధనంగా మారినప్పుడే డిజిటల్ యుగం నిజమైన ప్రయోజనం చేకూరుస్తుంది.



## చర్లపల్లి డివిజన్ చక్రిపురంలోని శ్రీ మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు

చర్లపల్లి, సెప్టెంబర్ 24: చర్లపల్లి డివిజన్ చక్రిపురం లోని శ్రీ మహంకాళి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ దీరావత్ శంకర్ నాయక్, వైస్ చైర్మన్ దిరావత్ హనుమంతు నాయాక్ లు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని చక్రిపురం లోని మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పలు అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకమును వారు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని, ముఖ్యంగా ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు దంజీ నాయక్, నరసింహ నాయక్, రమేష్ నాయక్, చందర్ నాయక్, వాల్య నాయక్, జగన్, శివుడు నాయక్, జమ్లా నాయక్, సోమ్లా, లక్ష్మణ్, మిట్టియా నాయక్, రవీందర్, హన్నా నాయక్, ఆలయ పూజారి జగన్ నాయక్, సతీష్, కిషన్, బాలాజీ, రవీందర్, స్వామి, బాలు నాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## మా భూములు మాకు కావాలి.. ఎలాంటి పరిహారం వద్దు - జీఓ 240 వద్దు

### రైతుల పక్షాన గళమెత్తిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మేడ్చల్, సెప్టెంబర్ 24 (స్టార్ న్యూస్) : మూసీ పరీవాహక అభివృద్ధి పథకంలో భాగంగా భూముల స్వాధీనానికి ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 240పై ఉప్పల్ నియోజకవర్గ రైతుల్లో నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రైతులతో కలిసి మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మనూ చౌదరిని కలిశారు. ఈ సందర్భంగా రైతులు "మా భూములు మాకు కావాలి.. ఎలాంటి పరిహారం వద్దు.. జీఓ 240 వద్దు" అంటూ తమ ఆందోళనను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రైతుల అభిప్రాయాలను కలెక్టర్‌కు వివరించిన ఎమ్మెల్యే, వారి భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోకుండా రైతుల ప్రయోజనాలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మూసీ నదికి సుమారు కిలోమీటర్ పరిధిలోని భూముల స్వాధీనం అంశంపై రైతులకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. చిన్నచిన్న కమతాలు కలిగిన రైతులు, ఇప్పటికే నివాస ప్రాంతాలు ఏర్పడిన భూముల యజమానులు, ఖాళీ స్థలాలు కలిగిన రైతుల విషయంలో ప్రభుత్వం అనుసరించనున్న విధానాన్ని స్పష్టంగా ప్రకటించాలని కోరారు.



## కుషాయిగూడ లడ్డు వేలం రూ 3.40 లక్షలు

కాప్రా, సెప్టెంబర్ 24 (స్టార్ న్యూస్) : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుషాయిగూడ మార్కెట్ యార్డు వద్ద గాంధీ మెమోరియల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాథుడి నిమజ్జన శోభాయాత్ర గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన వేలంపాటలో పెద్ద లడ్డు రూ. 3.40 లక్షలకు స్థానిక మణికంఠ ట్రేడర్స్ యజమాని చందా సంతోష్ గుప్తా దక్కించుకోగా , చిన్న లడ్డును రూ.1.51 లక్షలకు వరకాంత్ గౌడ్, చాలు అను 47 వేలకు మనీష్ రెడ్డి, లక్కీ డ్రా లో స్కూటర్ను అద్రిత్ దక్కించుకున్నారు. మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్ పాల్ రెడ్డి వీటిని అందజేశారు.



## నాచారం మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం...

నాచారం, సెప్టెంబర్ 24 : నాచారం మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. ముఖ్యఅతిథిగా నాచారం డీఐ వరుణ్ కాంత్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు లక్ష్మణ్, శ్రీధర్, రాము, కిషోర్, కిట్టు, కృష్ణమూర్తి, నరసింహ, తరుణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## నాచారం డివిజన్‌లో అభివృద్ధి పనులపై కాంగ్రెస్ ప్రచారం

నాచారం, సెప్టెంబర్ 24 (స్టార్ న్యూస్) : నాచారం డివిజన్‌లో రోడ్ల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ.1 కోటి 70 లక్షల 5శీ వేల నిధులు కేటాయించిందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ నిధులతో చేపడుతున్న రోడ్లు, సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనుల వివరాలను ప్రజలకు తెలియజేసేందుకు డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గల్లీగల్లీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న రోడ్ల నిర్మాణం, సీసీ రోడ్ల అభివృద్ధి, ఇతర మౌలిక వసతుల పనుల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు చేస్తున్న కృషిని పలువురు ప్రశంసించారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాచారం డివిజన్ అధ్యక్షుడు నూతలకంటి రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బంధారపు శ్రీకాంత్ గౌడ్, హెచ్.ఆర్. మోహన్, తుంగ తిరుపతి, ప్రకాష్ రెడ్డి, సంతోష్ రెడ్డి, ముదసాని రామ్ రెడ్డి, రమేష్ గౌడ్, మామిడాల రాజ్ రెడ్డి, మామిడాల సంతోష్ రెడ్డి, సునీల్ రెడ్డి, బద్రయ్య, ఫసియుద్దీన్, బంధారి



రఘు, గద్ద క్రాంతి, చందు నాయక్, నరేందర్ యాదవ్, జూపల్లి రాజేష్, అబ్రహం, టీ.హెచ్. బాలరాజ్, భాను గౌడ్, మధు గౌడ్ సేవాదళ్ వెంకటేష్ , శంకర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, ఎం.డి. జావీద్, వీఎస్టీ కాలనీ జావీద్, భారతమ్మ, లీలావతి, ఉమ, కహీం నజ్మా, లక్ష్మి, రాజశేఖర్ కుమ్మగొని శేఖర్ గౌడ్,

సీనియర్ సిటిజన్ సభ్యులు సాయిబాబా, శ్రీశైలం, యాదయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# రైతులు అపరాల సాగు పై మొగ్గు చూపాలి జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి

కామవరపుకోట, సెప్టెంబర్ 24: రైతులు అపరాల సాగు పై మొగ్గు చూపాలని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి సూచించారు. మండలం లో కామవరపుకోట మండలంలో గురువారం సుడిగాలి పర్యటన చేశారు ఈ సందర్భంగా పలువురు రైతు సోదరులతో కలసి వరి పంట పొలాలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ రైతుల యొక్క సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ప్రస్తుతం ఎలినీనో ప్రభావం వలన పంటలకు నష్టం ఏమైనా జరిగిందా అనే విషయాలను రైతులను అడిగి తెలుసుకోవడం జరిగింది. ముఖ్యంగా రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం సార్వా సీజన్లో వరి పంట వేయకుండా మిగిలిపోయిన భూములలో వరికి బదులుగా అపరాలు మినుములు, పెసర వంటి పంటలు సాగు చేయాలని విత్తనాలు 80% రాయితీ మీద సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వరి పంట సాగు చేయు రైతులు వరి రకాలను మార్పు చేసుకొని ఎక్కువ దిగుబడి నిచ్చే రకాలను సాగు చేయాలని తెలిపారు. రాబోవు రబీ సీజన్లో వరి పంట అనంతరం మొక్కజొన్న విత్తన పంట కింద సాగు చేయు రైతులు తప్పనిసరిగా ఆయా కంపెనీల నుండి ఒప్పందం తీసుకోవాలని, స్థానిక మండల వ్యవసాయ అధికారి వారి ద్వారా కంపెనీ వారితో మాట్లాడి ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత మాత్రమే మొక్కజొన్న విత్తన పంట కింద సాగు చేయాలని తెలిపారు. ముఖ్యంగా రైతులు ఎరువులు యూరియా మరియు డిఏపి విషయంలో ఆందోళన పడవద్దని, సరిపడ యూరియా డిఏపి అందుబాటులో కలవని, ఏవన్నా ఇబ్బందులు ఉంటే స్థానిక మండల వ్యవసాయ అధికారి వారి దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. పామాయిల్ పంట సాగు చేయు రైతులు యూరియా వినియోగం తగ్గించాలని తెలిపారు. పామాయిల్ పంటలలో గానోడేర్మా తెగులు ఎక్కువగా ఉందని తద్వారా మొక్కలు చనిపోవడం జరుగుతుందని స్థానిక రైతులు కలెక్టర్ గారి దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ విషయమై కలెక్టర్ గారు వెంటనే అధికారులు మరియు శాస్త్రవేత్తల తోటి సమావేశం ఏర్పాటు చేయిస్తామని రైతులకు తెలియపరిచినారు. రైతులు టిష్యూ కల్చర్ అరటి పంటకు రాయితీ ఒక హెక్టార్ మాత్రమే రాయితీ ఇస్తున్నారని, రాయితీ పెంచాలని కోరినారు. రైతులు రాయితీపై ముడి జింకు, జిప్సం మరియు వారాన్ సరఫరా చేయాలని కోరినారు. వ్యవసాయ మరియు ఉద్యాన పంటలకు మంచి గిట్టుబాటు ధర కొరకు పండించిన పంటను నిల్వ ఉంచుటకు రైతు సంఘాలకు కోల్డ్ స్టోరేజ్ గోదాములు నిర్మించుటకు రైతు సంఘల కు రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. రావికంపాడు గ్రామంలో వరి



పంట పొలాలను రైతులతో కలిసి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా రైతులు ప్రకృతి వ్యవసాయ సేద్యం చేయాలని, మార్కెట్ నందు డిమాండ్ ఉన్న వరి రకాలను సాగు చేయాలని తెలిపారు. వ్యవసాయాన్ని వ్యాపారంల చేయాలని రైతులకి తెలియజేయడం జరిగింది. ముఖ్యంగా రైతులు వ్యవసాయంలో ఖర్చును తగ్గించుకోవడం కోసం ప్రకృతి సేద్యాన్ని అలవర్చుకోవాలని తద్వారా నాణ్యమైన సుస్థిర దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతులు ముఖ్యంగా ప్రస్తుతం ఉన్న వ్యవసాయ విధానాలకు అనుగుణంగా నూతన సాంకేతిక పద్ధతులను తెలుసుకొని వాటిని వ్యవసాయంలో అనుసరించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని, వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు తప్పనిసరిగా పాటిస్తూ వ్యవసాయంలో సుస్థిరమైన నాణ్యమైన దిగుబడులు సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ భాషా, చింతలపూడి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వై సుబ్బారావు గారు, కామవరపుకోట తహసీల్దార్ ఎలీషా, మండల వ్యవసాయ అధికారి ముత్యాలరావు, ఉద్యానవన శాఖ అధికారి, ఇతర శాఖల అధికారులు మరియు రైతు సోదరులు పాల్గొనడం జరిగింది



## విద్యార్థుల ఆధార్ నవీకరణకు ప్రత్యేక శిబిరాలు

**సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 20 వరకు నిర్వహణ**

**... జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

విజయవాడ: సెప్టెంబర్ 24, 2026. ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆధార్ వివరాల నవీకరణకు ఈ నెల 25వ తేదీ నుంచి అక్టోబర్ 20వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. ఆధార్ నమోదు చేసుకోని విద్యార్థులతో పాటు మ్యాండటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ (వీదీఖ) చేయించుకోవాల్సిన విద్యార్థులకు ఈ ప్రత్యేక శిబిరాల ద్వారా ఆధార్ సేవలను అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు ఆధార్ సంబంధిత సేవలను మరింత చేరువ చేసేందుకు స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోనే ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి విద్యార్థుల ఆధార్ నమోదు, నవీకరణ ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంగా అమలు చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి, విద్యార్థులందరికీ నూరు శాతం ఎంబియు పూర్తయ్యేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. శిబిరాల్లో ప్రతిరోజూ అందించిన ఆధార్ సేవల వివరాలను సేకరించి, కార్యక్రమం పురోగతిని నిరంతరం పర్యవేక్షించనున్నట్లు వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లాలో అవసరమైన పాఠశాలలను శిబిరాల నిర్వహణకు ఎంపిక చేసి, ఆధార్ కిట్లు, సిబ్బంది, ఇతర అవసరమైన సదుపాయాలను సమకూర్చనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్, ఇతర అవసరమైన ఆధార్ వివరాలను సకాలంలో నవీకరించుకోవాలని సూచించారు.




## జంగారెడ్డిగూడెం పట్టణంలో టిడ్కో ఇళ్లను పరిశీలించిన చింతలపూడి ఎమ్మెల్యే

జంగారెడ్డిగూడెం, ఏలూరు జిల్లా: జంగారెడ్డిగూడెం పట్టణంలో నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాలను చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సోమవారం పరిశీలించారు. పట్టణ శివారులోని మార్కండేయ పురం టిడ్కో లేఅవుట్ వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే, అక్కడ జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిని అధికారులను, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతి బ్లాక్ లోకి వెళ్లి నిర్మాణ నాణ్యత, మౌలిక సదుపాయాల కల్పన తీరును స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ... "గత ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం గాలికి వదిలేసిందని కానీ కూటమి ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చడమే మన అందరి ప్రభుత్వ లక్ష్యం. అందుకే పనులను వేగవంతం చేశాం. ఎక్కడా నాణ్యత విషయంలో రాజీ పడొద్దు. మంచినీటి సరఫరా, డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్ సదుపాయాలన్నీ పూర్తి స్థాయిలో ఉండాలి" అని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

### డిసెంబర్ నాటికి పూర్తి చేసి అందజేస్తాం

లబ్ధిదారులు ఎన్నో ఏళ్లుగా ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారని, వారి ఎదురుచూపులకు డిసెంబర్ తో తెరపడుతుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. "డిసెంబర్ నాటికి మిగిలిన పనులన్నీ 100% పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అందజేస్తాం. దీనికి సంబంధించి అధికారులకు డెడ్ లైన్ పెట్టాం. ప్రతి వారం పురోగతిపై నివేదిక ఇవ్వాలి" అని అన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్, టిడ్కో డీఈ, ఏఈలు, కూటమి నాయకులు, స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



## భీంరెడ్డి బినామీల ఇంట్లో సోదాలు 1.35 కోట్ల నగదు స్వాధీనం

అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్

తెలంగాణ రాష్ట్ర డీజీపీ కార్యాలయం పరిధిలోని 'పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్' విభాగంలో పనిచేస్తున్న డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (DSP) పై నమోదైన అక్రమ ఆస్తుల కేసులో కొనసాగుతున్న సోదాలు అవినీతి నిరోధక శాఖ (సిటీ రేంజ్-II, హైదరాబాద్) గతంలో, తెలంగాణ రాష్ట్ర డీజీపీ కార్యాలయం పరిధిలోని 'పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్' విభాగంలో ఙూాగా పనిచేస్తున్న శ్రీ సంకిరెడ్డి భీమ్ రెడ్డిపై అక్రమ ఆస్తుల కేసును నమోదు చేసింది. 'అవినీతి నిరోధక చట్టం-1988' (2018 సవరణతో) లోని సెక్షన్ 13(1)(ఎ) మరియు సెక్షన్ 13(2) ప్రకారం Cr.No.21/RCA-CR-2/2026 (తేదీ: 27.06.2026) తో ఈ కేసు నమోదైంది.

గతంలో జరిగిన సోదాల కొనసాగింపుగా మరియు హైదరాబాద్‌లోని SPE & ACB కేసుల గౌరవనీయ ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి జారీ చేసిన సెర్చ్ వారెంట్ల ఆధారంగా, ఈ రోజు (24.09.2026) హైదరాబాద్ మరియు జహీరాబాద్ పరిధిలోని 10 వేర్వేరు ప్రాంతాలలో సోదాలు నిర్వహించారు. నిందిత అధికారితో ఆర్థిక మరియు ఇతర లావాదేవీలు కలిగి ఉన్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న అనుమానిత 'బినామీ'ల నివాసాలు కూడా ఇందులో ఉన్నాయి. ఈ సోదాల సమయంలో, అనుమానిత బినామీ ఆస్తులకు సంబంధించిన సాక్ష్యాలుగా పరిగణించబడే అనేక పత్రాలు మరియు ఇతర వస్తువులను వారి నివాసాల నుండి స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా, శ్రీ బొమ్మ వెంకటేష్ నివాసంలో రూ. 1.35 కోట్ల నగదు లభించింది. వీటితో పాటు విదేశీ కరెన్సీ మరియు సుమారు 14 లీటర్ల విదేశీ మద్యం కూడా దొరికాయి. విదేశీ మద్యం విషయమై తగిన చర్యలు తీసుకునేందుకు ఎక్సైజ్ శాఖకు సమాచారం అందించారు; చట్టప్రకారం సంబంధిత ఎక్సైజ్ అధికారులు దీనిపై కేసు నమోదు చేసే అవకాశం ఉంది.



## సీనియర్ సివిల్ జడ్జి చంచల్‌గూడ జైలును సందర్శించారు

**అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్**

హైదరాబాద్, సెప్టెంబర్ 24: నాంపల్లి (హైదరాబాద్) సెషన్స్ డివిజన్ పరిధిలోని జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ (ఙూాూ) కార్యదర్శి శ్రీమతి ఎ. శ్రీదేవి, చంచల్‌గూడలోని పురుషుల జైలు, న్యాయ సహాయ కేంద్రం (లీగల్ ఎయిడ్ క్లినిక్), వ్యసన విముక్తి కేంద్రం మరియు మహిళా జైలును సందర్శించి తనిఖీ చేశారు.

ఈ పర్యటనలో, ఆమె ఖైదీలకు అందుతున్న న్యాయ సహాయం మరియు ఉచిత న్యాయ సేవల గురించి ఆరా తీశారు. న్యాయ సహాయం అవసరమైన ఖైదీలకు జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు.

న్యాయ సహాయ కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం, ఖైదీలు తమ న్యాయపరమైన సమస్యలను స్వేచ్ఛగా పంచుకునేలా న్యాయ సేవలు అందుబాటులో ఉండాలని ఆమె సూచించారు. అలాగే, వ్యసన విముక్తి కేంద్రంలో చికిత్స పొందుతున్న వారి పరిస్థితిని సమీక్షించి, వారికి అవసరమైన మద్దతు మరియు సహాయం గురించి అధికారులతో చర్చించారు.

అనంతరం, ఆమె చంచల్‌గూడ మహిళా జైలును సందర్శించి, అక్కడ మహిళా ఖైదీలకు కల్పిస్తున్న న్యాయ సేవలు, వైద్య సదుపాయాలు మరియు సంక్షేమ చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. న్యాయ సహాయం అవసరమైన ప్రతి ఖైదీకి తగిన సహాయం అందేలా చూడాల్సిన ఆవశ్యకతను శ్రీమతి ఎ. శ్రీదేవి నొక్కి చెప్పారు.

ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్లు శ్రీ శివకుమార్ గౌడ్, శ్రీమతి అమరావతి మరియు ఇతర జైలు అధికారులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 1 మధ్యాహ్నం నుంచే ఇంటింటికీ పింఛన్ల పంపిణీ

**రూ.2,692.34 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం**

**బ్యాంకుల సెలవులు, సమ్మె ఉన్నా పింఛనుదారులకు ఇబ్బంది కలగనివ్వం**

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

అమరావతి, సెప్టెంబర్ 24 : రాష్ట్రంలో 61.80 లక్షల మంది పింఛనుదారులకు అక్టోబర్ 1న పింఛన్లు అందజేసేందుకు ప్రభుత్వం రూ.2,692.34 కోట్ల విడుదల చేసిందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విడుదల చేసే మొత్తం నిధుల్లో రూ.2,675.63 కోట్లను సంబంధిత స్వర్ణ గ్రామం / స్వర్ణ వార్డు పింఛను బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని.. రూ.16.65 కోట్లను పింఛనుదారుల బ్యాంకు ఖాతాల్లో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (ఙదీ) ద్వారా నేరుగా జమ చేస్తారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, ూచీూ ్రూూ=ూన విధానం ద్వారా ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఙదీ ద్వారా పింఛన్లను జమ చేసే ప్రక్రియను విజయనగరం జిల్లా గజపతినగరం మండలంలో పైలట్ ప్రాతిపదికన అమలు చేస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు. ఇందుకోసం ఈ మండలంలోని చీూ్రా పింఛనుదారుల ఖాతాల్లో రూ.0.06 కోట్లు నేరుగా జమ కానున్నట్టు మంత్రి కొండపల్లి తెలిపారు.

సెప్టెంబర్ 26వ తేదీ శనివారం బ్యాంకు సెలవు కావడం, అలాగే సెప్టెంబర్ 28,



29, 30 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల సమ్మె ఉన్న నేపథ్యంలో పింఛనుదారులకు ఎలాంటి అవస్థలు కలగకుండా ప్రభుత్వం ముందస్తుగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు మంత్రి తెలిపారు. ఈ మేరకు అక్టోబర్ 1వ తేదీ ఉదయమే పింఛన్ల పంపిణీకి అవసరమైన నగదును విత్‌డ్రా చేసుకునేలా బ్యాంకులను అందుబాటులో ఉంచాలని ూాదీజ (రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి)కి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. స్వర్ణ గ్రామం / స్వర్ణ వార్డు సిబ్బంది అక్టోబర్ 1వ తేదీ ఉదయం బ్యాంకుల నుండి నగదును విత్‌డ్రా చేసి.. అదే రోజు మధ్యాహ్నం నుంచే నేరుగా ఫించన్‌దారుల ఇళ్లవద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని మంత్రి కొండపల్లి స్పష్టం చేశారు. బ్యాంకు సెలవులు, సమ్మె కారణాల వల్ల పింఛన్ల పంపిణీ తేదీ, విధానంలో జరిగిన ఈ మార్పులను పింఛనుదారులందరూ గమనించి, పంపిణీ సిబ్బందికి మరియు ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు.







# భారీ వర్షాలతో దెబ్బతిన్న చింతలపాడు గ్రామంలో జిల్లా కలెక్టర్ పర్యటన

**లిదెబ్బతిన్న ప్రతి ఇంటినీ వెంటనే ఎన్యుమరేషన్ చేసి నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలిలి**

**లిపూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న గృహాల వివరాలను సమగ్రంగా సేకరించాలిలి**

**జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ, శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు.**

తిరువూరు (చింతలపాడు): సెప్టెంబర్ 24, 2026. తిరువూరు మండలం చింతలపాడు గ్రామంలో ఇటీవల కురిసిన అధిక వర్షాలు, వీచిన బలమైన గాలుల కారణంగా దెబ్బతిన్న గృహాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ కొలికపూడి శ్రీనివాసరావుతో కలిసి గురువారం క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. గ్రామంలోని పరిస్థితులను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, భారీ వర్షాలు, గాలుల కారణంగా నష్టపోయిన కుటుంబాలను పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులతో జిల్లా కలెక్టర్ స్వయంగా మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. బాధితులు ఎవరూ అధైర్యపడవద్దని, నష్టపోయిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. చింతలపాడు గ్రామంలో సుమారు 70 గృహాలు పాక్షికంగా, పూర్తిగా దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. గ్రామంలో దెబ్బతిన్న ప్రతి ఇంటిని వెంటనే ఎన్యుమరేషన్ చేసి, పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న గృహాల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. నష్టపోయిన గృహాల వివరాలతో సమగ్ర నివేదికను వెంటనే సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని, అర్హులైన బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. "వర్షాలు, గాలుల కారణంగా నష్టపోయిన ఒక్క బాధిత కుటుంబం కూడా నష్టపరిహారం విషయంలో మిగిలిపోకూడదు. ప్రతి ఇంటి నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రభుత్వానికి నివేదించాలి" అని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం గ్రామంలోని పునరావాస కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న బాధితులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, ఆహారం, తాగునీరు తదితర అంశాలపై ఆరా తీశారు. వర్షాలు పూర్తిగా తగ్గే వరకు బాధితులు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, భోజనం, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు తదితర మౌలిక సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని, బాధితులకు సమయానుకూలంగా భోజనం, తాగునీరు అందించాలని స్పష్టం చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో గ్రామంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వర్షాలు తగ్గిన వెంటనే గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడంతోపాటు, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

ప్రత్యేకంగా డయేరియా, మలేరియా తదితర వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు వైద్య, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని వైద్య, పంచాయతీ అధికారులకు సూచించారు. గ్రామంలోని వాటర్ ట్యాంకులను పూర్తిగా శుభ్రపరిచి, క్లోరినేషన్ చేయించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజలు కనీసం వారం రోజుల పాటు కాచి చల్లార్చిన నీటినే తాగునీటిగా వినియోగించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. నీటి ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో వాగులు, చెరువులు, నీటి ప్రవాహ ప్రాంతాల వద్దకు ప్రజలు వెళ్లకుండా అధికారులు నిరంతరం అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దని, ముఖ్యంగా వాగులు, చెరువులు మరియు నీటి ప్రవాహాల వైపు వెళ్లరాదని హెచ్చరించారు. పిల్లలు, వృద్ధులు, ఇతరులు ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా



కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అనంతరం గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలలో పర్యటించి వర్షాలు, గాలుల కారణంగా దెబ్బతిన్న గృహాలను పరిశీలించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా బాధితులకు అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ వారికి భరోసా కల్పించారు. నష్టపోయిన ప్రతి కుటుంబానికి అర్హత మేరకు నష్టపరిహారం అందేలా ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని తెలిపారు. వర్షాల కారణంగా ఏర్పడిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య, విద్యుత్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలో పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ప్రజలకు అవసరమైన సేవలను ఎప్పటికప్పుడు అందించాలని సూచించారు. ఈ పర్యటనలో తిరువూరు ఆర్డీవో అరవ కుమార్, తహసిల్దార్ డి.చంద్రమౌళి, ఎంపీడీవో రవిబాబుతో పాటు రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## వర్షాల వేళ పంటల పరిస్థితిపై జేసీ ఇలక్కియ పరిశీలన

**క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులతో మాట్లాడిన జాయింట్ కలెక్టర్**

**పంటలకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పత్తి తదితర పంటల పరిస్థితిని క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె వత్సవాయి మండలం మక్కపేట గ్రామంలో పర్యటించి పత్తి పంటలను పరిశీలించారు. వర్షాల కారణంగా పంటలపై పడుతున్న ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. పంటల పరిస్థితిపై వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల వారీగా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. వర్షాల కారణంగా పంటలకు ఏదైనా నష్టం సంభవించినట్లయితే క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను నమోదు చేయాలని, రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. పొలాల్లో నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించి నీటి పారుదలకు అవసరమైన చర్యలు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ లింగాల వంతెనను పరిశీలించి అక్కడి పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో వంతెనలు, వాగులు, వంకల వద్ద నీటి ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షించాలని,



ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తదుపరి జగ్గయ్యపేట పట్టణంలోని ఊర చెరువు ప్రాంతాన్నిపరిశీలించారు. చెరువులో నీటి నిల్వ, నీటి ప్రవాహం, పరిసర ప్రాంతాల పరిస్థితిని పరిశీలించారు. క్షేత్రస్థాయి పర్యటనలో నందిగామ ఆర్డీవో జి.అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

## వాగులు, వంకల వద్ద నిరంతర పర్యవేక్షణ

**వర్షాల వేళ ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ చర్యలు**

**అధికారులకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశాలు**

**వర్షాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పర్యటించిన కలెక్టర్**



జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వాగులు, వంకలు, వంతెనలు, చెరువులు, ఇతర జలవనరుల వద్ద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల సమయంలో వాగులు, వంకల్లో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉన్నందున ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అక్కడ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ గురువారం క్షేత్రస్థాయి సుడిగాలి పర్యటనలో భాగంగా హెచ్. ముత్యాలంపాడు వంతెన, వెలగలేరు తదితర ప్రాంతాలను సందర్శించారు. వర్షాల పరిస్థితి, వాగులు--వంకల్లో నీటి ప్రవాహం, వంతెనల స్థితిగతులను పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. భారీ వర్షాల కారణంగా నీటి ప్రవాహం పెరిగిన సందర్భాల్లో ప్రజలు వాగులు, వంకలు దాటేందుకు ప్రయత్నించకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వంతెనలు, కల్వర్టులు, రహదారుల వద్ద నీటి ప్రవాహాన్ని నిరంతరం గమనించాలని, ఎక్కడైనా రాకపోకలకు ఇబ్బంది లేదా ప్రమాదకర పరిస్థితి ఏర్పడే అవకాశముంటే వెంటనే సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, కాలువలు, వాగులు, వంకల పరిస్థితిని స్థానిక అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.



## చంద్రబాబుకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కృతజ్ఞతలు

విజయనగరం, సెప్టెంబర్ 24: విజయనగరం జిల్లాలోని 4.36 లక్షల మంది డ్వాక్రా అక్కచెల్లెమ్మల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని, కోట్ల విలువైన 13.29 ఎకరాల భూమిని ఉచితంగా కేటాయించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారికి హృదయపూర్వక ధన్యవాదాలు అని మీవీజు, సెర్ప్, చీ=× సేవలు ఉ సాధికారత శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరం మండలం, వేణుగోపాలపురం బిట్-2 గ్రామం సర్వే నంబర్ 536/1 లో గల 13.29 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (ఱ=ఱూ)కు కేటాయిస్తూ రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. విజయనగరం పట్టణానికి సమీపంలో ఉండి, కోట్లాది రూపాయల మార్కెట్ విలువ ఉన్న ఈ భూమికి ల్యాండ్ కాస్ట్ ను మినహాయించి పేదరిక నిర్మూలన, మహిళా సాధికారతే లక్ష్యంగా ఉచితంగా ఇవ్వడం ముఖ్యమంత్రి గారి మహిళా పక్షపాతానికి నిదర్శనమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. 4.36 లక్షల మంది మహిళలకు ఉపాధి లక్ష్యంగా సమీకృత క్యాంపస్ తన ప్రత్యేక చొరవతో రూపుదిద్దుకున్న ఈ బృహత్తర ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని 1,023 గ్రామ సమాఖ్యల పరిధిలోని మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు. ఈ 13.29 ఎకరాల్లో 5 సమీకృత కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి.



## దిగుమతి సుంకం తగ్గింపుపై తుమ్మల ఆగ్రహం

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 :**

ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశీయ ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే అవకాశముందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఒకవైపు దేశంలో ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని రాష్ట్రాలను ప్రోత్సహిస్తూ, మరోవైపు విదేశాల నుంచి దిగుమతి అయ్యే పామాయిల్‌కు అనుకూలంగా విధానాలు అమలు చేయడం వల్ల రైతుల్లో ఆందోళన పెరుగుతోందని అన్నారు. ఈ నిర్ణయం రైతుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా క్రూడ్ పామ్ ఆయిల్‌పై మొత్తం దిగుమతి సుంకాన్ని 16.5 శాతం నుంచి 11 శాతానికి తగ్గించిన విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. దీంతో విదేశీ పామాయిల్ దిగుమతులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని, దేశీయంగా ఉత్పత్తి అయ్యే ఆయిల్ పామ్ గెలల ధరలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల ప్రయోజనాల దృష్ట్యా దిగుమతి సుంకాన్ని పెంచాలని కోరుతున్న సమయంలో కేంద్రం విరుద్ధమైన నిర్ణయం తీసుకోవడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు.



## కొత్తిమీర.. రుచికి, సువాసనకు సహజ వరం

**డెస్క్, సెప్టెంబర్ 24 :**

కొత్తిమీర భారతీయ వంటకాలో అత్యంత విస్తృతంగా ఉపయోగించే ఆకుకూరల్లో ఒకటి. కూరలు, పప్పులు, చట్నీలు, సూప్‌లు, సలాడ్లు వంటి అనేక వంటకాలో దీనిని ఉపయోగిస్తారు. ప్రత్యేకమైన సువాసన, రుచి కారణంగా వంటకాలకు చివరలో కొత్తిమీర జల్లడం అనేక ఇళ్లలో సాధారణంగా కనిపిస్తుంది. కొత్తిమీరలో విటమిన్-ఏ, విటమిన్-సి, విటమిన్-కే వంటి పోషకాలు లభిస్తాయి. అదనంగా కొంత పీచు, ఖనిజాలు కూడా ఉంటాయి. అందువల్ల సమతుల్య ఆహారంలో భాగంగా దీనిని చేర్చుకోవడం ఆరోగ్యానికి మేలు చేయవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

# విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడంపై జగదీశ్‌రెడ్డి విమర్శలు



**దామరచర్ల, సెప్టెంబర్ 24 :**

నల్గొండ జిల్లా దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో నెలకొన్న బొగ్గు కొరత, విద్యుత్ ఉత్పత్తి అంతరాయాలపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి గురువారం యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను సందర్శించిన ఆయన, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం ప్లాంట్ అధికారులతో సమావేశమై విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడానికి గల కారణాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్లాంట్‌లో ఎదురవుతున్న సమస్యలకు రాష్ట్ర ప్రభుత్వం, ఇంధన శాఖ వైఖరే కారణమని ఆరోపించారు. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గు సరఫరా సక్రమంగా లేకపోవడం వల్లే ఉత్పత్తి అంతరాయాలు ఏర్పడుతున్నాయని అన్నారు. విద్యుత్ రంగ నిర్వహణలో తగిన ప్రణాళికలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సింగరేణి సంస్థ నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, ఆ బొగ్గు పవర్ ప్లాంట్లకు పూర్తిస్థాయిలో చేరడం లేదని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. దాదాపు 40 లక్షల టన్నుల బొగ్గును ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని పేర్కొన్నారు. ఫలితంగా రాష్ట్రంలోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో నిల్వలు తగ్గి, విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం పడుతోందని అన్నారు. బొగ్గు కొరత కారణంగా రైతులు, వ్యవసాయ రంగం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి తలెత్తుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే వ్యవసాయ కార్యకలాపాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ రంగం బలోపేతానికి తక్షణ చర్యలు అవసరమని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించామని జగదీశ్‌రెడ్డి తెలిపారు. అదే విధంగా ప్రస్తుతం కూడా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు తగిన బొగ్గు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ ఉత్పత్తి వ్యవస్థలో ఎలాంటి అంతరాయాలు లేకుండా చూడడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి పరిస్థితులను సమీక్షించిన అనంతరం, బొగ్గు సరఫరా వ్యవస్థపై సమగ్ర పరిశీలన చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా రైతాంగానికి నిరంతర విద్యుత్ అందించేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని కోరారు. ఈ పరిశీలన కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.





## రెండు పడక గదుల ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 24 :**

కేఆర్కే కాలనీలో నిర్మిస్తున్న రెండు పడక గదుల ఇళ్లలో మిగిలి ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. గురువారం కాలనీలో పర్యటించిన ఆయన నిర్మాణాల పురోగతి, మౌలిక వసతుల కల్పన, లబ్ధిదారుల అవసరాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లలో ఇంకా పూర్తి కాని నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, పనుల్లో జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ మిగిలిన పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో పారిశుధ్య పరిస్థితులను కూడా పరిశీలించిన కలెక్టర్, చెత్త తొలగింపు, కాలువల నిర్వహణ, పరిశుభ్రత అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. లబ్ధిదారులు నివాసం ఉండేందుకు అనుకూల వాతావరణం కల్పించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. తాగునీటి సరఫరా, విద్యుత్ కనెక్షన్లు, అంతర్గత రహదారులు వంటి మౌలిక వసతుల కల్పనపై కూడా సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



## రిమ్స్‌లో వైద్య సేవలపై సమీక్ష

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 24 :**

రిమ్స్ ఆసుపత్రిలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాద ఘటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా గురువారం చైల్డ్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యులతో కలిసి ఆసుపత్రిని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆయన, వైద్య సేవల అందుబాటు, రోగుల పరిస్థితి, అత్యవసర సదుపాయాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అగ్నిప్రమాదం అనంతరం చేపట్టిన చర్యలు, రోగుల భద్రత కోసం అమలు చేస్తున్న ఏర్పాట్లను సమీక్షించారు. క్రిటికల్ కేర్ వార్డు, పీడియాట్రిక్స్ విభాగం, మొదటి అంతస్తులోని ఐసీయూ వార్డుతో పాటు పలు కీలక విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. ఎయిమ్స్ వైద్యులతో కలిసి చిన్నారులకు అందుతున్న వైద్య సేవల నాణ్యత, చికిత్స విధానాలు, అందుబాటులో ఉన్న పరికరాలు, అవసరమైన సిబ్బంది పరిస్థితిపై చర్చించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, అత్యవసర చికిత్స సౌకర్యాలు, సిబ్బంది పనితీరును కూడా అధికారులు సమీక్షించారు. రోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ముఖ్యంగా చిన్నారుల చికిత్సలో ఎలాంటి లోపాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



## గణేష్ బందోబస్తు విధుల్లో ఎస్ఐ మృతి

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 :**

హైదరాబాద్‌లో గణేష్ నిమజ్జన బందోబస్తు విధుల్లో పాల్గొంటున్న కొత్తగూడెం టూటౌన్ ఎస్ఐ కె. వెంకన్న గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందడం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజల భద్రత కోసం విధులు నిర్వర్తిస్తున్న సమయంలో జరిగిన ఈ ఘటన అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. వెంకన్న మరణం పోలీసు శాఖకు తీరని లోటని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో అంకితభావంతో పనిచేస్తూ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. ప్రజల రక్షణ కోసం నిరంతరం శ్రమించే పోలీసు సిబ్బంది సేవలు అమూల్యమైనవని తెలిపారు. విధి నిర్వహణలో చూపిన నిబద్ధత, కర్తవ్యపాలన వెంకన్నను ప్రత్యేకంగా నిలబెట్టాయని పేర్కొన్నారు. వెంకన్న మృతి ఆయన కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా మొత్తం పోలీసు వ్యవస్థకు తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని ముఖ్యమంత్రి అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వెంకన్న కుటుంబ సంక్షేమం కోసం అవసరమైన సహాయసహకారాలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్య మంత్రి స్పష్టం చేశారు. కుటుంబ సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

## కృత్రిమ మేధ, క్లౌడ్ రంగాలకు కొత్త దిశ

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 :**

రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం మైక్రోసాఫ్ట్ ఇండియా సౌత్ సెంట్రల్ డేటా సెంటర్ రీజియన్‌ను ప్రారంభించారు. హైదరాబాద్ సాంకేతిక రంగ అభివృద్ధిలో ఇది మరో కీలక ఘట్టమని పేర్కొన్న మంత్రి, క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ రంగాల్లో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత రెండు దశాబ్దాలుగా హైదరాబాద్‌తో అనుబంధం కొనసాగిస్తున్న మైక్రోసాఫ్ట్, ఇప్పుడు నగరాన్ని భవిష్యత్ సాంకేతికతల కేంద్రంగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగస్వామిగా మారిందన్నారు. హైదరాబాద్ ఇప్పటికే దేశంలో ప్రధాన డేటా సెంటర్ గమ్యస్థానంగా ఎదుగుతోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 300 మెగావాట్ల డేటా సెంటర్ సామర్థ్యం కార్యకలాపాల్లో ఉండగా, మరో 2 గిగావాట్ల సామర్థ్యం అభివృద్ధి దశలో ఉందని వెల్లడించారు. డేటా నిల్వ, క్లౌడ్ సేవలు, కృత్రిమ మేధ ఆధారిత పరిశ్రమల పెరుగుదలకు అవసరమైన మౌలిక వసతులను ప్రభుత్వం వేగంగా అభివృద్ధి చేస్తోందన్నారు. 2029 నాటికి తెలంగాణలో డేటా సెంటర్ సామర్థ్యాన్ని 5 గిగావాట్లకు పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని శ్రీధర్ బాబు తెలిపారు. ఈ రంగంలో విస్తృత పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు డిజిటల్ మౌలిక వసతులు, కృత్రిమ మేధ పర్యావరణ వ్యవస్థ అభివృద్ధి ద్వారా సుమారు 30 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థలకు తెలంగాణను అత్యంత అనుకూల గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కేవలం డేటా సెంటర్ల నిర్మాణమే కాకుండా, మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ఆవిష్కరణలకు అనుకూల వాతావరణాన్ని ఒకే వేదికపైకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు.





## క్యారెట్.. కళ్లకే కాదు శరీరానికీ మేలు

**డెస్క్, సెప్టెంబర్ 24 :**

క్యారెట్ ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా వినియోగించే పోషకాహార కూరగాయల్లో ఒకటి. ఆకర్షణీయమైన నారింజ రంగుతో పాటు అనేక పోషకాలు కలిగి ఉండటంతో ఆరోగ్యకర ఆహారంలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. సలాడ్లు, కూరలు, జ్యూసులు, సూప్‌లు వంటి అనేక రూపాల్లో క్యారెట్‌ను వినియోగిస్తున్నారు. క్యారెట్‌లో బీటా కెరోటిన్ అనే పదార్థం సమృద్ధిగా ఉంటుంది. ఇది శరీరంలో విటమిన్-ఏగా మారుతుంది. కంటి ఆరోగ్యం, చర్మ సంరక్షణ, రోగనిరోధక వ్యవస్థ పనితీరుకు విటమిన్-ఏ ముఖ్యమైన పోషకంగా పరిగణించబడుతుంది. అందువల్ల క్యారెట్‌ను సమతుల్య ఆహారంలో భాగంగా తీసుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. క్యారెట్‌లో పీచు పదార్థం కూడా లభిస్తుంది. ఇది జీర్ణక్రియకు మద్దతునివ్వడంతో పాటు కడుపు నిండిన భావనను ఎక్కువసేపు కలిగించడంలో సహాయపడవచ్చు. అందువల్ల ఆరోగ్యకర ఆహార అలవాట్లలో క్యారెట్‌కు ప్రాధాన్యం పెరుగుతోంది. పచ్చిగా తినడంతో పాటు వండుకుని కూడా క్యారెట్‌ను వినియోగించవచ్చు. సలాడ్లు, ఉప్మా, కూరలు, పులావ్ వంటి వంటకాలో కలిపి తీసుకోవడం సాధారణంగా కనిపిస్తుంది. పిల్లలకు కూడా రుచికరమైన చిరుతిండిగా క్యారెట్ ముక్కలను అందించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఏ ఆహారంలాగే క్యారెట్‌ను కూడా మితంగా తీసుకోవడం మంచిది. ఒక్క కూరగాయపైనే ఆధారపడకుండా పలు రకాల కూరగాయలు, పండ్లు, పప్పులు, ధాన్యాలు కలిగిన సమతుల్య ఆహారం ఆరోగ్యానికి మరింత ఉపయోగకరమని నిపుణులు సూచిస్తున్నారు.



# పాలసీదారులకు బిగ్ రిలీఫ్

## 'డార్క్ ప్యాటర్న్స్', డిజిటల్ మోసాలకు ఐఆర్‌డీఏఐ చెక్!

**న్యూఢిల్లీ సెప్టెంబరు 24 :**

భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) బీమా రంగంలో పారదర్శకతను పెంచేందుకు, ఆన్‌లైన్ వెబ్‌సైట్ల మోసపూరిత విధానాలకు ('డార్క్ ప్యాటర్న్స్') అడ్డుకట్ట వేసేందుకు సమగ్ర ప్రతిపాదనలతో ఒక చర్చాపత్రాన్ని విడుదల చేసింది. వినియోగదారుల ప్రయోజనాలే ధ్యేయంగా రూపొందించిన ఈ నూతన మార్గదర్శకాలు అమల్లోకి వస్తే బీమా కొనుగోలు ప్రక్రియలో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. ఈ నూతన ప్రతిపాదనల ప్రకారం, వినియోగదారులు ఆన్‌లైన్‌లో బీమా పాలసీల వివరాలు లేదా ప్రీమియం ధరల సమాచారాన్ని తెలుసుకోవడానికి ముందుగానే తమ మొబైల్ నంబర్, ఈమెయిల్ వంటి వ్యక్తిగత వివరాలను నమోదు చేయాల్సిన నిబంధనను తొలగించనున్నారు. దీనివల్ల వినియోగదారుల సమాచార భద్రత పెరగడమే కాకుండా, పదే పదే వచ్చే ప్రకటనల ఫోన్ కాల్స్, మెసేజ్‌ల బెడద తప్పుతుంది. అంతేకాకుండా, బీమా పంపిణీ వ్యవస్థలోని ఖర్చులు, కమీషన్లు మరియు మార్కెటింగ్ విధానంపై పూర్తి స్పష్టత తీసుకురావడానికి పంపిణీ సంస్థలను ఇన్సూరెన్స్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు , ఇన్సూరెన్స్ డిస్ట్రిబ్యూషన్ పర్సన్స్ , మరియు మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌స్టిట్యూషన్స్ అని మూడు రకాలుగా వర్గీకరించనున్నారు.




# విజయనగరంలో ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ నూతన శాఖ ప్రారంభం

**విజయనగరం సెప్టెంబరు 24 :**

ఉత్తరాంధ్రలో వేగంగా విస్తరిస్తున్న ప్రాముఖ్యమైన వాణిజ్య, విద్యా కేంద్రమైన విజయనగరంలో ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ ఆదిత్య బిర్లా క్యాపిటల్ లిమిటెడ్ అనుబంధ విభాగమైన 'ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్' తమ నూతన శాఖను ఘనంగా ప్రారంభించింది. విశాఖపట్నం సహా పొరుగు జిల్లాలతో మెరుగైన రవాణా అనుసంధానం కలిగి ఉండటంతో ఈ ప్రాంతంలో నివాస గృహాలకు, స్థిరాస్తి (రియల్ ఎస్టేట్) రంగానికి డిమాండ్ పెరుగుతోంది. ఈ క్రమంలో స్థానిక ప్రజలకు అనుకూలమైన గృహ రుణ పరిష్కారాలను అందుబాటులోకి తేవడమే ధ్యేయంగా ఈ శాఖను ఏర్పాటు చేసినట్లు సంస్థ తెలిపింది. ఈ కొత్త కార్యాలయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా కంపెనీ శాఖల సంఖ్య 16కి చేరింది. వేతన జీవులు, స్వయం ఉపాధి నిపుణులు, చిన్న వ్యాపారవేత్తలకు హోమ్ లోన్లు, నిర్మాణ రుణాలు, ఆస్తిపై రుణాలు వంటి వివిధ ఆర్థిక సేవలను కంపెనీ అందించనుంది. నూతన శాఖ ప్రారంభోత్సవం సందర్భంగా వినియోగదారుల కోసం సంస్థ ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు అమలులో ఉండే ఈ ఆఫర్ ద్వారా ఎటువంటి నమోదు రుసుము (లాగిన్ ఫీజు) లేకుండా సేవలు అందించడంతో పాటు, అర్హత కలిగిన ఖాతాదారులకు రూ. 50 లక్షల వరకు తక్షణ రుణ మంజూరులను చేపడుతున్నట్లు వెల్లడించింది.




# బ్యాంకు సమ్మె: ముందస్తుగా జీతాలు

**న్యూఢిల్లీ సెప్టెంబరు 24 :**

దేశవ్యాప్తంగా తలపెట్టిన బ్యాంకుల సమ్మెను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు, పింఛనుదారులకు ఊరటనిచ్చే ముందస్తు నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు బ్యాంకు సేవలు పూర్తిగా నిలిచిపోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా సెప్టెంబర్ నెలకు సంబంధించిన వేతనాలు, పింఛను సొమ్మును సెప్టెంబర్ 25న ముందస్తుగా జమ చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించింది. ఈ నిర్ణయం సాధారణ ఉద్యోగులతో పాటు రక్షణ, తపాలా, టెలికమ్యూనికేషన్స్ వంటి అత్యవసర విభాగాల సిబ్బందికి కూడా వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ చెల్లింపులను ముందస్తు ప్రాతిపదికన పరిగణించి, వచ్చే అక్టోబర్ నెల వేతన లెక్కల్లో తగిన సర్దుబాటు చేయనున్నట్లు వెల్లడించింది. సమ్మె సమయంలో చెల్లింపులకు ఎలాంటి ఆటంకం కలగకుండా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ ముందస్తు చర్య ఉద్యోగ వర్గాలకు ఎంతో ఆసరాగా నిలవనుంది.

# ఎస్సీ, ఎస్టీ కేసులపై వేగవంతమైన చర్యలు



### త్వరిత పరిష్కారం, సకాలంలో పరిహారం చైర్మన్ ఆదేశం

### జిల్లా అధికారులతో సమగ్ర సమీక్ష

### అధికారుల జవాబుదారీతనం తప్పనిసరి, నిధుల వినియోగంపై స్పష్టత

### పెండింగ్ కేసుల వివరాలు, పరిష్కార మార్గాలు

### బాధితుల వినతుల స్వీకరణ

**సంగారెడ్డి ప్రతినిధి, 24 సెప్టెంబర్ :**

సంగారెడ్డి, సెప్టెంబర్ 24: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి, బాధితులకు ప్రభుత్వం అందించే పరిహారం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య జిల్లా యంత్రాంగానికి సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి పోలీసు, రెవెన్యూ, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి సంక్షేమ శాఖలతో సహా వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలు, అట్రాసిటీ కేసులు, రోస్టర్ పాయింట్ల అమలు, బ్యాక్‌లాగ్ ఖాళీలు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీలు ఇతర అణగారిన వర్గాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని చైర్మన్ సూచించారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని, అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన కేసుల పరిష్కారంపై కలెక్టర్, ఎస్పీలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అట్రాసిటీ కేసుల దర్యాప్తు, విచారణలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని చైర్మన్ స్పష్టం చేశారు. సిద్దిపేటలో మొబైల్ కోర్టు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణకు సూచించారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు వారి కోటా మేరకు ప్రాధాన్యత కల్పించాలని, వారి హక్కులు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. సివిల్ రైట్స్ డే కార్యక్రమాలకు అధికారులు, ప్రజలు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఆయా వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం మాత్రమే వినియోగించాలని, ఇతర అవసరాలకు మళ్లించరాదని చైర్మన్ స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అందాల్సిన సంక్షేమ పథకాల అమలులో అధికారులు జాప్యం లేదా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, యూనిఫామ్స్, పుస్తకాలు, మౌలిక వసతులు, స్కాలర్‌షిప్‌లు, వసతి గృహాల మరమ్మతులపై అధికారుల ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు అందుతున్న రైతు భరోసా, రైతు బీమా, పారిశుద్ధ్య కార్మికులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, ఔట్‌సో ర్సింగ్ ఉద్యోగులు, బ్యాక్‌లాగ్ ఖాళీల వివరాలను శాఖల వారీగా అడిగి తెలుసుకున్న చైర్మన్, బ్యాక్‌లాగ్ ఖాళీలను త్వరితగతిన భర్తీ చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్య లను పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. జిల్లాలో శాశ్వత అంగన్ వాడీ భవనాలు లేని కేంద్రాలకు స్థలాలను గుర్తించి, భవనా ల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని జిల్లా సంక్షేమ అధికారికి సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, భూ సేకరణలో అసైన్డ్ భూములు కోల్పోయిన ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా పరిధిలో పరిష్కరించగలిగిన సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని, కమిషన్ చైర్మన్ సూచనలు, సలహాలను అమలు చేస్తామని చెప్పారు. జిల్లాలో అట్రాసిటీ కేసుల్లో జనవరి 2026 నుంచి ఆగస్టు 31 వరకు 109 మంది బాధితులకు 1.70 కోట్ల పరిహారం అందించామని, వీరిలో 88 మంది ఎస్సీలు, 21 మంది ఎస్టీలు ఉన్నారని వివరించారు. మరో 119 పెండింగ్ అట్రాసిటీ కేసులకు సంబంధించి పరిహారం చెల్లించేందుకు అవసరమైన 1.82 కోట్ల నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటివరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలను కమిషన్ చైర్మన్‌కు వివరించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత సమయంలోపు చార్జిషీట్లు దాఖలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్సీ, ఎస్టీల నుంచి వివిధ సమస్యలపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య వినతులను స్వీకరించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు జల్లా శంకర్, రాంబాబు నాయక్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరి దేవి, జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బంగారం ధరలకు భారీ తగ్గుదల

**హైదరాబాద్, సెప్టెంబరు 24 :**




బుధవారం పెరిగిన బంగారం ధరలు గురువారం భారీగా తగ్గాయి. గుడ్‌రిటర్న్స్ ప్రకారం ఉదయం 10 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,52,680గా నమోదైంది. బుధవారంతో పోలిస్తే రూ. 1,520 తగ్గింది. 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,39,950గా ఉండగా.. రూ. 1,400 మేర తగ్గింది. వెండి ధర కూడా భారీగా తగ్గింది. కిలో వెండి ధర రూ. 5,000 తగ్గడంతో హైదరాబాద్, విజయవాడలో ప్రస్తుతం రూ. 2.45 లక్షలుగా ఉంది. తెలంగాణలో హైదరాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ. 1,52,680, 22 క్యారెట్ల ధర రూ. 1,39,950, 18 క్యారెట్ల ధర రూ. 1,14,510గా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతిలోనూ ఇదే ధరలు కొనసాగుతున్నాయి. దేశంలోని ముంబై, కోల్‌కతా, కేరళలోనూ 24 క్యారెట్ల ధర రూ. 1,52,680గా ఉంది.

# ఆన్‌లైన్ షాపింగ్‌లో ఈ 7 జాగ్రత్తలు తప్పనిసరి

**హైదరాబాద్, సెప్టెంబరు 24 :**




ఆన్‌లైన్ షాపింగ్‌లో వినియోగదారుల హక్కులను మరింతగా కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త ఈ-కామర్స్ నిబంధనలను తీసుకొచ్చింది. 'వినియోగదారుల రక్షణ (ఈ-కామర్స్) (సవరణ) నిబంధనలు-2026'ను సెప్టెంబరు 9న నోటిఫై చేయగా.. ఇవి 2027 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ధరల పారదర్శకత, సెర్చ్ ఫలితాలు, స్పాన్సర్డ్ జాబితాలు, డార్క్ ప్యాటర్న్స్, అమ్మకందారుల వివరాలు, ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాల్లో కొత్త నిబంధనలు మార్పులు తీసుకొచ్చాయి. కొత్త నిబంధనలతో వినియోగదారులకు అదనపు రక్షణ లభించనప్పటికీ.. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేటప్పుడు వ్యక్తిగతంగా అప్రమత్తంగా ఉండటం కూడా అవసరం. కొనుగోలు చేసే ముందు ఈ ఏడు విషయాలను తప్పక పరిశీలించాలి. అమ్మకందారుడి వివరాలు చూడండి: వస్తువు ఫొటోలు, రేటింగ్‌లు, ఆకర్షణీయమైన సమీక్షలు మాత్రమే చూసి కొనుగోలు చేయకండి. అమ్మకందారుడి వివరాలు, చిరునామా, రిటర్న్-రిఫండ్, వారంటీ, డెలివరీ, చెల్లింపు వివరాలను పరిశీలించాలి. ముఖ్యంగా ఖరీదైన వస్తువులు కొనేటప్పుడు ఈ వివరాలను పూర్తిగా తనిఖీ చేయడం మంచిది. చెల్లింపు పేజీని తనిఖీ చేయండి: డబ్బు చెల్లించే ముందు వెబ్‌సైట్ చిరునామా సరిగ్గా ఉందో చూడాలి. గుర్తింపు పొందిన చెల్లింపు పేజీలోనే లావాదేవీ పూర్తి చేయాలి. ఓటీపీ, పిన్, పాస్‌వర్డ్ వంటి రహస్య వివరాలను ఎవరితోనూ పంచుకోకూడదు. సెర్చ్ ఫలితా లను గుడ్డిగా నమ్మకండి: వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా సెర్చ్ ఫలితాలను మార్చడాన్ని కొత్త నిబంధనలు నిషేధిస్తున్నాయి. అయినప్పటికీ.. సెర్చ్‌లో మొదటి స్థానం లో కనిపించే ఉత్పత్తే నాణ్యమైనదని భావించకండి. అమ్మకందారుడి వివరాలు, ధర, రేటింగ్‌లు, ఇతర కొనుగో లుదారుల సమీక్షలను పరిశీలించాలి. స్పాన్సర్డ్ జాబితా లను గుర్తించండి: డబ్బు చెల్లించి సెర్చ్ ఫలితాల్లో పైకి వచ్చే ఉత్పత్తులను స్పష్టంగా 'స్పాన్సర్డ్' లేదా ప్రకటనగా చూపించాలి. కాబట్టి పై స్థానంలో కనిపించిందనే కారణంతో ఆ ఉత్పత్తిని వెంటనే నమ్మకూడదు. డార్క్ ప్యాటర్న్స్ పట్ల జాగ్రత్త: వినియోగదా రులను మభ్యపెట్టి అనవసరంగా కొనుగోలు చేయించడం, సేవలకు చందా తీసుకునేలా ఒత్తిడి చేయడం వంటి మోసపూరిత రూప కల్పనలను డార్క్ ప్యాటర్న్స్ అంటారు. కొత్త నిబం ధనల ప్రకారం ఈ అంశాలపై ప్లాట్‌ఫామ్‌లు నిబంధనలు పాటించడంతో పాటు వార్షిక స్వీయ తనిఖీ నిర్వహించాలి.



# నానిపై భార్య అంజనా భావోద్వేగ వ్యాఖ్యలు

**హైదరాబాద్, సెప్టెంబరు 24 :**

నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటించిన 'ది ప్యారడైజ్' చిత్రం భారీ అంచనాల మధ్య విడుదలైన వేళ, ఆయన భార్య అంజనా సామాజిక మాధ్యమాలో పంచుకున్న భావోద్వేగ సందేశం అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. నాని సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ.. 2009లో ఆయన ప్రారంభ రోజుల్లో ఒక సినిమా చూసేందుకు వెళ్లగా, విడుదల రోజే ఉదయం ప్రదర్శన కూడా పడలేదని, పరిశ్రమలోకి కొత్తగా వచ్చిన ఒక నటుడి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం ఎంత కష్టమో అప్పుడే తనకు అర్థమైందని ఆమె పేర్కొన్నారు. అయితే సరిగ్గా 17 ఏళ్ల తర్వాత నాని సినిమా అనగానే ప్రేక్షకులు థియేటర్లకు తరలిరావడానికి కారణం ఆయనపై ఉన్న నమ్మకమేనని, ఈ స్థాయి వెనుక ఎన్నో ఏళ్ల కష్టం, పట్టుదల ఉన్నాయని అంజనా తెలిపారు. ప్రతి సినిమాను తన బిడ్డలా భావించే నాని సినీ ప్రయాణానికి తాను ప్రత్యక్ష సాక్షినని, కుటుంబంగా ఎప్పుడూ ఆయనకు అండగా ఉంటామని ఆమె స్పష్టం చేశారు. మరోవైపు 'ది ప్యారడైజ్' చిత్రబృందానికి మెగాస్టార్ చిరంజీవి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. నానిలోని ఉత్సాహం, నటనలో నిజాయితీ, కొత్తగా ఏదైనా చేయాలనే తపన తనను ఎప్పుడూ ఆకట్టుకుంటాయని ఆయన కొనియాడారు. 'దసరా' తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త మైలురాళ్లను అందుకోవాలని ఆకాంక్షిస్తూ మొత్తం చిత్రబృందానికి తన ఆశీస్సులు అందించారు.



# 'జార్జ్ క్రిష్'లో మానస వారణాసి

**హైదరాబాద్, సెప్టెంబరు 24 :**

హీరో శర్వానంద్, దర్శకుడు శ్రీను వైట్ల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'జార్జ్ క్రిష్'. ఈ సినిమాలో కథానాయికగా మానస వారణాసిని ఎంపిక చేసినట్లు చిత్రబృందం ప్రకటించింది. శర్వానంద్‌కు జోడీగా ఆమె కనిపించనున్నారు. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో ఇటీవల గుర్తింపు తెచ్చుకున్న మానస.. తన నటనతో ప్రశంసలు అందుకున్నారు. 'జార్జ్ క్రిష్'లో ఆమె పాత్రకు ప్రాధాన్యం ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. శర్వానంద్, శ్రీను వైట్ల తొలిసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ సినిమాపై మొదటి నుంచే ఆసక్తి నెలకొంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై అనిల్ సుంకర సమర్పణలో రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. శర్వానంద్‌కు సంక్రాంతి సెంటిమెంట్ ఉండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఇటీవలే పూజా కార్యక్రమాలతో సినిమా ప్రారంభమైంది.

# రామ్ చరణ్ - సుకుమార్ చిత్రం పూజా కార్యక్రమాలకు ముహూర్తం

**హైదరాబాద్, సెప్టెంబరు 24 :**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, స్టార్ దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రానున్న ః=జ17ః చిత్రంపై టాలీవుడ్‌లో సరికొత్త ఊహాగానాలు, అంచనాలు నెలకొన్నాయి. 'రంగస్థలం' వంటి సంచలన విజయం తర్వాత వీరిద్దరి కలయికలో తెరకెక్కుతున్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలను విజయాదశమి (దసరా) పండగ సందర్భంగా అక్టోబర్ 20న వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ వేడుక అనంతరం నవంబర్ నుంచి నిరంతర చిత్రీకరణ (రెగ్యులర్ షూటింగ్) ప్రారంభించాలని సుకుమార్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నా రు. ఈ ప్రాజెక్ట్ కోసం రామ్ చరణ్ ప్రత్యేకంగా మేకోవర్ అవుతున్నారు. 'పెద్ది' చిత్రం తర్వాత సుకుమార్ పాత్రకు అనుగుణంగా ఆయన బరువు తగ్గి మరింత సన్నగా మారుతున్నారు. ఇటీవ ల బేగంపేట విమానాశ్రయంలో ఆయన సరికొత్త రూపంలో కనిపించడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.



# 'ది ప్యారడైజ్' ఘనంగా విడుదల

**హైదరాబాద్, సెప్టెంబరు 24 :**

నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా, ప్రతిభావంతుడైన దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కిన అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం 'ది ప్యారడైజ్' సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదలైంది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'దసరా' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించడంతో, ఈ నయా చిత్రంపై మొదటి నుంచే సినీ వర్గాల్లోనూ, ప్రేక్షకుల్లోనూ తీవ్ర స్థాయి అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం విడుదలకు ముందే ముందస్తు టికెట్ విక్రయాల్లో సరికొత్త రికార్డులను సృష్టించింది. బుక్‌మైషో మరియు డిస్ట్రిక్ట్ వంటి అంతర్జాల వేదికల ద్వారా 15 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా వెల్లడించింది. తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల్లోనా ముందస్తు ప్రదర్శనలకు అనూహ్య స్పందన లభించడంతో థియేటర్ల వద్ద పండుగ వాతావరణం నెలకొంది. ఈ చిత్రంలో నాని 'జడల్' అనే అత్యంత శక్తివంతమైన, విభిన్నమైన పాత్రలో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. కథానాయికగా కయాదు లోహర్ నటించగా, సీనియర్ నటుడు మోహన్ బాబు, రాఘవ్ జుయల్, తనికెళ్ల భరణి, సోనాలి కులకర్ణి కీలక పాత్రలు పోషించారు. స్వరకర్త అనిరుధ్ రవిచందర్ అందించిన నేపథ్య సంగీతం, శ్రీకాంత్ ఓదెల మార్క్ భావోద్వేగాలు, భారీ యాక్షన్ సన్నివేశాలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ చిత్రం తొలిరోజే భారీ వసూళ్లను సాధించే దిశగా దూసుకుపోతోంది.




# గుండెనిండా గుడిగంటలు అమూల్య గౌడ సందడి

**హైదరాబాద్, సెప్టెంబరు 24 :**

తెలుగు బుల్లితెరపై ప్రసారమయ్యే ధారావాహికలు, వాటిలోని నటీనటులు వెండితెర తారల స్థాయిలో విశేష ఆదరణ సొంతం చేసుకుంటున్నారు. ప్రస్తుతం 'స్టార్ మా' వేదికగా ప్రసారమవుతున్న ప్రముఖ ధారావాహిక 'గుండెనిండా గుడిగంటలు'లో 'మీనా' అనే పాత్రలో నటిస్తూ కన్నడ నటి అమూల్య గౌడ తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. కుటుంబ విలువలకు ప్రాధాన్యతనిచ్చే అమాయకపు అమ్మాయిగా భావోద్వేగ సన్నివేశాల్లో సహజ నటనను కనబరుస్తూ ఆమె మంచి ప్రజాదరణ పొందారు. గతంలో కన్నడ సీరియల్ 'శ్రీగౌరీ' ద్వారా నటనా ప్రయాణాన్ని ప్రారంభించి, అక్కడ 'బిగ్ బాస్' రియాలిటీ కార్యక్రమంలోనూ పాల్గొని అమూల్య మంచి పేరు సంపాదించుకున్నారు. ధారావాహికలో సాంప్రదాయ చీరకట్టులో కనిపించే ఈ నటి, సామాజిక మాధ్యమాలో మాత్రం ఆధునిక దుస్తులతో కూడిన విభిన్న రూపాలతో (స్టైలిష్ లుక్స్) నెటిజన్లను ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఈమెకు అంతర్జాలంలో 5 లక్షలకు పైగా అనుచరులు (ఫాలోవర్లు) ఉండగా, ఆమె పంచుకునే చిత్రాలు సామాజిక మాధ్యమాలో విశేషంగా వైరల్ అవుతున్నాయి.





# వివాహం మాతృత్వంపై శ్రుతిహాసన్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, సెప్టెంబరు 24 :**

సినీ పరిశ్రమలో నటిగా, గాయనిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు కమల్ హాసన్ కుమార్తె శ్రుతిహాసన్ వివాహం, మాతృత్వంపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం అంతర్జాలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దక్షిణాది చలనచిత్ర పరిశ్రమతో పాటు ఉత్తరాది సినిమాల్లోనూ నటిస్తూ పాన్ ఇండియా స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ నటి, ఇటీవల బాలీవుడ్ నటి సోహా అలీఖాన్ నిర్వహించిన ఒక ప్రత్యేక సంభాషణ కార్యక్రమంలో పాల్గొని తన వ్యక్తిగత ఆలోచనలను పంచుకున్నారు. సదరు కార్యక్రమంలో మాతృత్వం గురించి ప్రస్తావిస్తూ.. తల్లి కావడానికి తప్పనిసరిగా వివాహం చేసుకోవాల్సిన అవసరం ఉందా అనే ప్రశ్నకు శ్రుతిహాసన్ స్పందించారు. ప్రస్తుతం సమాజంలో తల్లిగా మారేందుకు శాస్త్రీయంగా అనేక మార్గాలు అందుబాటులో ఉన్నాయని, పిల్లలను దత్తత తీసుకోవడానికి కూడా తాను పూర్తి సుముఖంగా ఉన్నానని వెల్లడించారు. అలాగే తన జీవన విధానంలో భాగంగా సహజ సిద్ధమైన మార్గంలోనూ మాతృత్వాన్ని పొందాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

Apublished by **KALIDINDI SUMALATHA**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of RS USAR PUBLICATIONS, 1ST FLOOR, H.NO. 59-5-7, PALLAVI APARTMENTS, ITI COLLEGE ROAD, OPP MRF SHOW ROOM, VIJAYAWADA, N T R, ANDHRA PRADESH - 520008 edited by **RAGHURAMA RAJU KALIDINDI** and printed by **KALIDINDI SUMALATHA** at KING DIGITAL OFFSET PRINTERS, 24 11/2-14, LANKAVARI VEEDHI, BHAVAJIPETA 4TH LINE, MAHALAKSHMIGUDI NEAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520003. PRGI NO: APTEL/26/A7657, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467